Follow: @ANNTELUGU
14-07-2026
ANN తెలుగు
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 191 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## షాబాద్ ఆరు హత్యల కేసులో
# కీలక మలుపు

- నిందితుడు రాజ్‌కుమార్ మృతి
- సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియో గుర్తించిన పోలీసులు

**రంగారెడ్డి, మహా:** రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఆరుగురు హత్యకు గురైన సంచలన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ మృతదేహం సోమవారం కొత్తూరు మండలం పంజర్ల గ్రామ పరిసరాల్లో లభ్యమైంది. మృతదేహం సమీపంలో విషం సీసా కూడా లభించడంతో అతడు ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ నిపుణులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలను సేకరించారు. రాజ్‌కుమార్ మేనమామ మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

## ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తం



- రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు కార్యాచరణకు ప్రభుత్వం సిద్ధం.
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

02

## 30 రోజులు జైలులో ఉంటే పదవి రద్దు




- బిల్లుకు జేపీసీ కీలక సవరణలు.
- నేరం రుజువైతేనే శాశ్వత అనర్హత.

02

## 'కూటమి' ఉక్కుపాదం

- 'ఫేక్' గొట్టం బాబుల భరతం పడుతున్న సర్కార్.
- పత్రికా స్వేచ్ఛ ముసుగులో రెచ్చిపోతే జైలుకే




02



# జనం లోకి జూనియర్ ఎన్టీఆర్

- 'ఊరువాడ' పేరుతో వంద కోట్ల మహా సేవా యజ్ఞం
- ఈ నెల 18న తిరుపతి తాజ్ హోటల్ వేదికగా చారిత్రక ప్రకటన
- తెలుగు రాష్ట్రాల్లో ఉత్కంఠ

**హైదరాబాద్, మహా :** ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రం మారబోతున్నదనే చర్చ మొదలైంది . దశాబ్దాలుగా నందమూరి అభిమానులు, రాజకీయ విశ్లేషకులు, సామాన్య ప్రజలు ఎదురుచూస్తున్న చారిత్రక ఘట్టానికి అడుగులు పడుతున్నాయి. కేవలం వెండితెరపైనే కాకుండా వాస్తవ జీవితంలోనూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నటరత్న, తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక నందమూరి తారక రామారావు స్ఫూర్తితో.. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ జూనియర్ ఎన్టీఆర్ ప్రజల బాట పడుతున్నారు. కేవలం ఒక సినిమా గ్లామర్‌ను నమ్ముకుని హడావుడిగా పార్టీలు ప్రకటించే మిగతా 2వ పేజీలో



## ఆషాఢ బోనాల జాతరకు
# సర్వం సిద్ధం

జూలై 16 నుండి ఆగస్టు 13 వరకు బోనాలు

- అన్ని శాఖలతో సమన్వయ ఏర్పాట్లు పూర్తి
- ప్రధాన ఆలయాల్లో వైభవంగా బోనాలు
- పోలీసుల పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు
- ప్రత్యేక బస్సులతో భక్తుల రవాణా
- దేవాలయాల వద్ద క్యూ లైన్లు ఏర్పాటు

02





## పేపర్ లీకులు, అవినీతిపై కేంద్రం మౌనం వీడాలి

భారత విద్యా వ్యవస్థపై రాహుల్ గాంధీ విమర్శలు..

02



# షాబాద్ ఆరు హత్యల కేసులో కీలక మలుపు


( మొదటి పేజీ తరువాయి )



గ్రామమైన పంజర్లలో ఈ ఘటన చోటుచేసుకోవడం దర్యాప్తులో మరో కీలక అంశంగా మారింది. ఘటన స్థలంలో లభించిన రాజ్‌కుమార్ సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని పరిశీలించగా, అందులో ఒక సెల్ఫీ వీడియో ఉన్నట్లు గుర్తించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, హత్యలకు ముందు రోజు అయిన జూలై 10న ఆ వీడియోను రికార్డు చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. అందులో తాను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని, బాలికను నమ్మి మోసపోయానని, జీవితంపై విరక్తి కలిగిందని పేర్కొన్నట్లు సమాచారం. అయితే వీడియోలోని విషయాలపై పోలీసులు అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. సంఘటన స్థలాన్ని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, మరణానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. సెల్‌ఫోన్‌లో లభించిన వీడియో, ఫోరెన్సిక్ ఆధారాలు, ఇతర సాంకేతిక సమాచారాన్ని పరిశీలించి కేసు దర్యాప్తును పూర్తి చేస్తామని పోలీసులు వెల్లడించారు. కాగా, రాజ్‌కుమార్‌పై గతంలో నమోదైన పోక్సో కేసు నేపథ్యంలో కక్షతో షాబాద్‌లో బాలిక, ఆమె కుటుంబ సభ్యులతో పాటు తన భార్య, ఇద్దరు చిన్నారులను కలిపి మొత్తం ఆరుగురిని దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు ఇప్పటికే వెల్లడించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించగా, నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు విస్తృత గాలింపు చేపట్టిన విషయం తెలిసిందే.

# 'కూటమి' ఉక్కుపాదం

- **'ఫేక్' గొట్టం బాబుల భరతం పడుతున్న సర్కార్.**
- **పత్రికా స్వేచ్ఛ ముసుగులో రెచ్చిపోతే జైలుకే.**



**అమరావతి , మహా :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలతో అప్రతిహతంగా ముందుకు దూసుకుపోతోంది. గత ఐదేళ్లుగా సోషల్ మీడియాను అడ్డం పెట్టుకుని, పత్రికా స్వేచ్ఛ ముసుగులో ఇష్టారాజ్యంగా చెలరేగిపోయిన ఫేక్ యూట్యూబర్లు, సోషల్ మీడియా సైకోల ఆటలు కట్టించేందుకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలోని సర్కార్ నడుం బిగించింది. సమాజంలో ద్వేషాన్ని రగిల్చి, వ్యక్తుల ప్రతిష్టను దిగజార్చేలా, ప్రజాస్వామ్య విలువలకే పాతరేసేలా అసత్య ప్రచారాలు చేసే వారికి ఇకపై ఏపీలో నూకలు చెల్లవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భాగంగానే, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒక సరికొత్త ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. వ్యవస్థను భ్రష్టుపట్టించేలా వ్యవహరించిన ఒక 'రావణుడి' తరహా కరుడుగట్టిన యూట్యూబర్‌పై చట్టపరంగా కేసులు నమోదు చేసి, కటకటాల వెనక్కి నెట్టడం ద్వారా కూటమి ప్రభుత్వం తమ ఉద్దేశాన్ని కుండబద్దలు కొట్టింది. సమాజానికి చేటు చేసే శక్తులతో పెట్టుకుంటే చట్టబద్ధంగా రఫ్ ఆడించేస్తామని కూటమి సర్కార్ చేతల్లో చూపిస్తూ సామాజిక మాధ్యమాల్లోని కలుపు మొక్కలను సమూలంగా ఏరివేస్తోంది.ఈ చర్యల ద్వారా కేవలం ఒకరిద్దరిని అరెస్టు చేసి వదిలేయడం కాకుండా, వ్యవస్థాగత మార్పులు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. యూట్యూబర్ల పేరుతో బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడే శక్తులు, వారి వెనుక ఉండి నడిపించే రాజకీయ అదృశ్య శక్తులు ఎంతగా గోల చేసినా, ప్రభుత్వ నిర్ణయాల్లో అణువంత కూడా మార్పు లేదు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ విషయంలో ఎక్కడా ఒక అడుగు కూడా వెనక్కి తగ్గడం లేదు. ఒకసారి అడుగు ముందుకేశాక వెనక్కి తగ్గితే వ్యవస్థ మీద ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతుందనే దృఢ సంకల్పంతో ఆయన ఉన్నారు. అందుకే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంపూర్ణ మార్గదర్శకత్వంలో, రాష్ట్రంలో పౌరుల ఆత్మగౌరవ పరిరక్షణే ధ్యేయంగా ఒక మాస్టర్ ప్లాన్ అమలు చేస్తున్నారు. అందులో భాగంగానే ఏపీ వ్యాప్తంగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న యూట్యూబర్లందరికీ పోలీసుల ద్వారా ముందస్తు నోటీసులు జారీ చేసే ఒక వినూత్నమైన, చట్టబద్ధమైన ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇది పత్రికా స్వేచ్ఛను హరించడం కాదని, స్వేచ్ఛ పేరుతో స్వైరవిహారం చేస్తున్న బ్లాక్ మెయిలర్లకు హద్దులు గుర్తుచేయడమేనని మేధావులు, రాజకీయ విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు.

ఏపీ పోలీస్ వ్యవస్థ ఇప్పుడు యూట్యూబర్ల ఇళ్లకు వెళ్లి అత్యంత మర్యాదపూర్వకంగా, అదే సమయంలో అంతే కఠినంగా న్యాయపరమైన నోటీసులు అందజేస్తోంది. ఈ నోటీసుల్లో కేవలం హెచ్చరికలు మాత్రమే కాదు, చట్టాల పట్ల పూర్తి అవగాహన కల్పించేలా సమాచారం పొందుపరచడం కూటమి ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనం. పత్రికా స్వేచ్ఛ ముసుగులో హద్దులు దాటితే ఏయే సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు? ఆయా సెక్షన్ల తీవ్రత ఎంత? నేరం రుజువైతే ఎలాంటి కఠిన శిక్షలు పడతాయి? తదితర వివరాలను ఆ నోటీసుల్లో సవివరంగా, కులంకషంగా వివరించారు. "మీడియా ముసుగులో ఏం మాట్లాడినా చెల్లుతుంది.. వ్యక్తిగతంగా ఎంత తిడితే అంత హీరోలమైపోతాం" అని విర్రవీగే వారికి, చట్టం తన పని తాను చేసుకుపోతుందనే స్పష్టమైన సందేశాన్ని సర్కార్ పంపింది. తప్పు చేసే ముందే చట్టం గురించి వివరించి, ఆ తర్వాత కఠినంగా వ్యవహరించాలన్న పోలీసుల తాజా వ్యూహం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. నోటికి ఏది వస్తే అది మాట్లాడితే లాఠీలు, కేసుల మోతలు తప్పవని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం, అదే సమయంలో సామాజిక మాధ్యమాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. కొందరు పనిగట్టుకుని యూట్యూబ్ చానెళ్ల ద్వారా విషం చిమ్ముతున్న తరుణంలో, వారికి ముకుతాడు వేయడం ద్వారా నిజమైన జర్నలిస్టులకు, వాస్తవాలు మాట్లాడే వారికి ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోంది. అరెస్టులకు ముందే ఇలా న్యాయపరమైన నోటీసులు ఇచ్చి, దారితప్పిన వారికి తప్పులు సరిదిద్దుకునే అవకాశం ఇవ్వడం అత్యుత్తమ పరిపాలనకు అద్దం పడుతోంది. మొత్తానికి, యూట్యూబ్ గొట్టాలు పట్టుకుని ఇష్టారాజ్యంగా మాట్లాడే 'ఫేక్' బాబుల గుండెల్లో ఇప్పుడు రైళ్లు పరిగెడుతున్నాయి. ఇకపై ఏపీలో నోరు పారేసుకుంటే కేసుల బరువు మోయక తప్పదన్న భయం వారిలో మొదలైంది. ఇది ఖచ్చితంగా కూటమి ప్రభుత్వం సాధించిన నైతిక విజయమని, పవన్ కళ్యాణ్ నిబద్ధతకు, చంద్రబాబు పరిపాలనా దక్షతకు ఇది ప్రత్యక్ష ఉదాహరణ అని రాష్ట్ర ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తోంది. చెత్తను శుభ్రం చేసి, స్వచ్ఛమైన సమాచార వ్యవస్థను నిర్మించడంలో ఏపీ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తం

- **రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు కార్యాచరణకు ప్రభుత్వం సిద్ధం.**
- **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.**



హైదరాబాద్, మహా. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వల్ల తలెత్తే వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని రకాల ముందస్తు చర్యలను చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఇక్రిశాట్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షపాతం పరిస్థితులను ప్రతిరోజూ జిల్లా వారీగా సమీక్షిస్తూ రైతులకు శాస్త్రీయ సూచనలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 33 జిల్లాల పరిస్థితులను సమీక్షించగా 13 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని, మిగిలిన 20 జిల్లాల్లో వర్షపాతం లోటు కొనసాగుతోందని మంత్రి తెలిపారు. వర్షాభావ పరిస్థితులు ఉన్న జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సమన్వయంతో పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన చర్యలను వెంటనే అమలు చేయాలని స్పష్టం చేశారు. శాస్త్రవేత్తలు సూచించే ప్రతి యాజమాన్య చర్య రైతుల వరకు చేరేలా వ్యవసాయ శాఖ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని శాస్త్రీయ విధానాలతో ఎదుర్కొనేందుకు రాష్ట్రంలో డిఎస్ఆర్ విధానాన్ని అమలు చేయాలని మంత్రి సూచించారు. ఆగస్టు నెలాఖరు వరకు ప్రతి వారం ప్రత్యేక బులెటిన్ విడుదల చేయాలని, అందులో మండలాల వారీగా నమోదైన వర్షపాతం, రానున్న వారానికి, నెలాఖరు వరకు ఉండే వాతావరణ పరిస్థితుల అంచనాలను పొందుపరచాలని తెలిపారు. డ్రై స్పెల్స్ ఏర్పడే అవకాశాలు, గరిష్ఠకనిష్ఠ ఉష్ణోగ్రతలు, నేల తేమ పరిస్థితులు, భూగర్భ జలాల లభ్యత, సాగునీటి పరిస్థితి, విద్యుత్ సరఫరా, పంటల స్థితిగతులు, రైతులు చేపట్టాల్సిన యాజమాన్య చర్యలపై సమగ్ర సమాచారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. నీటిపారుదల శాఖతో సమన్వయం చేసుకుని ప్రాజెక్టుల క్యాచ్‌మెంట్ ప్రాంతాల్లో ఈ నెల, వచ్చే నెల వాతావరణ అంచనాలను విశ్లేషించాలని మంత్రి సూచించారు. ఆయా ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉండే నీటి నిల్వలు, ఇన్‌ఫ్లోలు, సాగునీటి లభ్యతపై ఖచ్చితమైన అంచనాలను కూడా వారపు బులెటిన్‌లో పొందుపరచాలని స్పష్టం చేశారు. రైతు వేదికలు, గ్రామ పంచాయతీలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సామాజిక మాధ్యమాలు, స్థానిక మీడియా ద్వారా ఈ బులెటిన్‌ను విస్తృతంగా రైతులకు చేరవేసి శాస్త్రీయ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు. సమావేశం అనంతరం వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. అధిక ఉష్ణోగ్రతలు, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపదికగా తీసుకుని కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా జిల్లా వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసినట్లు చెప్పారు. వర్షాలు ఆలస్యమైతే అవసరమయ్యే విత్తనాలపై ముందుగానే అంచనా వేసి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జూలై 15 వరకు వర్షాలు ఆలస్యమైతే 16.30 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, జూలై 30 వరకు ఆలస్యమైతే 13.82 లక్షల క్వింటాళ్లు, ఆగస్టు 15 వరకు వర్షాభావ పరిస్థితులు కొనసాగితే 12.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేసి వాటిని ముందుగానే అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. వరి రైతులు శాస్త్రవేత్తల సూచనలను తప్పనిసరిగా పాటించాలని మంత్రి సూచించారు. నారుమడి దశలో ఉన్న రైతులు నారు పీకడానికి వారం రోజుల ముందు ఎకరానికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3 సీజీ గ్రాన్యూల్స్ వేయాలని, నాటే సమయంలో నారు ఆకుల చివరలను కత్తిరించి నాటాలని సూచించారు. 15×10 సెంటీమీటర్ల దూరంతో దగ్గరగా నాటి ప్రతి గుంతలో 6 నుంచి 8 మొక్కలు ఉంచాలని తెలిపారు. సిఫార్సు చేసిన మోతాదుతో పోలిస్తే 25 శాతం అదనపు నత్రజని ఇవ్వాలని, మొత్తం నత్రజనిలో 70 శాతం నాటే సమయంలో, మిగిలిన 30 శాతం పూత ప్రారంభ దశలో వేయాలని సూచించారు. ఇంకా నారు వేయని రైతులు తక్కువ వ్యవధిలో దిగుబడి ఇచ్చే వరి రకాలతో డ్రై డైరెక్ట్ సీడెడ్ రైస్ విధానాన్ని అనుసరించాలని వ్యవసాయ శాఖ సూచించింది. కాలువల ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యతను బట్టి వరికి బదులుగా మొక్కజొన్న, సజ్జలు, రాగులు, కందులు, మినుములు, పొద్దుతిరుగుడు, నువ్వులు, అలసందలు, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించింది. ప్రస్తుతం మొలక దశలో ఉన్న మొక్కజొన్న, పత్తి పంటలకు రాబోయే రెండు వారాల్లో వర్షాభావ పరిస్థితులు కొనసాగితే నేల తేమను కాపాడేందుకు కలుపు నియంత్రణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. రాష్ట్రంలో అవసరమైన విత్తనాలు, ఎరువులపై ఇప్పటికే సమగ్ర అంచనా పూర్తి చేశామని, మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలకు అనుగుణంగా అవసరమైన విత్తనాలను ముందుగానే సమీకరించినట్లు అధికారులు తెలిపారు. మార్క్‌ఫెడ్, విత్తన సంస్థలు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ రైతులకు ఎలాంటి కొరత తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ప్రత్యామ్నాయ సాగు విధానాలు, నీటి యాజమాన్యం, నేల తేమ సంరక్షణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ పద్ధతులు, శాస్త్రవేత్తలు సూచించిన యాజమాన్య చర్యలపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి రైతు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సరైన నిర్ణయాలు తీసుకునేలా గ్రామస్థాయిలో వ్యవసాయ అధికారులు నిరంతరం మార్గనిర్దేశం చేస్తారని ఆయన స్పష్టం చేశారు.

# 30 రోజులు జైలులో ఉంటే పదవి రద్దు

**ఢిల్లీ, మహా :** ప్రభుత్వం ప్రతిపాదించిన "30 రోజులు జైలులో ఉంటే ప్రజాప్రతినిధి పదవి రద్దు" బిల్లులో కీలక మార్పులను సూచిస్తూ సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సిఫార్సులు చేసింది. వరుసగా 30 రోజులకు మించి జైలులో ఉన్న ప్రజాప్రతినిధి పదవి స్వయంచాలకంగా రద్దవుతుందనే ప్రతిపాదనలో సవరణలు చేయాలని కమిటీ అభిప్రాయపడింది. నేరం కోర్టులో రుజువయ్యే వరకు పదవిని శాశ్వతంగా రద్దు చేయకుండా, తాత్కాలికంగా సస్పెండ్ చేసే విధానాన్ని అమలు చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పలు కీలక బిల్లులను కేంద్ర ప్రభుత్వం సభ ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోంది. మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ వంటి అంశాలతో పాటు ప్రజాప్రతినిధుల అనర్హతకు సంబంధించిన బిల్లుపైనా చర్చ జరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇదే సమయంలో ఈ బిల్లుపై అధికార, ప్రతిపక్షాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో పలువురు మంత్రులు, ముఖ్యమంత్రులు వివిధ కేసుల్లో జైలులో ఉన్నప్పటికీ పదవుల్లో కొనసాగడం రాజకీయ, న్యాయపరమైన చర్చలకు దారితీసింది. ఇలాంటి పరిస్థితులకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రతిపాదించినట్లు పేర్కొంటున్నారు. అయితే రాజకీయ కక్షసాధింపుతో నమోదయ్యే కేసుల కారణంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ముందస్తుగా తమ పదవులను కోల్పోయే పరిస్థితి తలెత్తకూడదని జేపీసీ అభిప్రాయపడింది. సవరణల ప్రకారం, ఐదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ శిక్ష పడే అవకాశం ఉన్న తీవ్రమైన క్రిమినల్ కేసుల్లో మాత్రమే సస్పెన్షన్ నిబంధన వర్తించేలా ప్రతిపాదించారు. కోర్టు విచారణలో ఆరోపణలు రుజువు కాకపోతే సంబంధిత ప్రజాప్రతినిధి తిరిగి తన పదవిని చేపట్టే అవకాశం ఉండేలా నిబంధనలు రూపొందించాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ సవరణలు అమల్లోకి వస్తే ప్రజాప్రతినిధుల అనర్హతకు సంబంధించిన విధానంలో కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ ప్రతిపాదనలు చట్టంగా అమలులోకి రావాలంటే పార్లమెంట్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. పార్లమెంట్‌లో జరిగే చర్చలు, తుది నిర్ణయం ఈ బిల్లుపై స్పష్టతను ఇవ్వనున్నాయి.

# జనం లోకి జూనియర్ ఎన్టీఆర్

( మొదటి పేజీ తరువాయి )

సాంప్రదాయానికి భిన్నంగా, అత్యంత పకడ్బందీగా, హేతుబద్ధమైన విశ్లేషణతో ఆయన తన ఎంట్రీకి అడుగులు వేస్తున్నారు. తాత ఎన్టీఆర్ నాడు చైతన్య రథంపై ఊరువాడ తిరిగి సృష్టించిన ప్రభంజనాన్ని, నేడు అదే 'ఊరువాడ' పేరుతో జూనియర్ ఎన్టీఆర్ సేవా యజ్ఞం రూపంలో పునరావృతం చేయబోతున్నారు. ఇది కేవలం ఒక రాజకీయ నాయకుడి ఎంట్రీ కాదు, ఒక సరికొత్త సామాజిక నాయకత్వానికి జరుగుతున్న అంకురార్పణ అని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

జూనియర్ ఎన్టీఆర్ తీసుకున్న అత్యంత సంచలనాత్మక నిర్ణయం 'ఊరువాడ' సేవా కార్యక్రమం. రాజకీయాల్లోకి రాకముందే ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునేందుకు ఏకంగా 100 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఆయన నిబద్ధతను, సేవా దృక్పథాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ వంద కోట్ల నిధులతో రాష్ట్రంలోని మారుమూల గ్రామాల నుంచి పట్టణాల వరకు విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక సదుపాయాలపై దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. ఒక వ్యక్తిగత ట్రస్ట్ లేదా సంస్థ ద్వారా ఇంత పెద్ద మొత్తంలో నిధులను వెచ్చించి క్షేత్రస్థాయిలో ప్రజలకు నేరుగా సేవలు అందించడం బహుశా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇదే తొలిసారి. జూనియర్ ఎన్టీఆర్ కేవలం రాజకీయ అధికారం కోసం కాకుండా, ఒక బలమైన సామాజిక పునాదిని నిర్మించుకోవాలని, ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకోవాలని ఎంత లోతైన కసరత్తు చేశారో అర్థమవుతుంది. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది నిరుపేద కుటుంబాలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరనుంది.

ఏదైనా ఒక మహాకార్యాన్ని తలపెట్టినప్పుడు అది ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం నుంచి ప్రారంభించడం తెలుగువారి సెంటిమెంట్. సరిగ్గా ఇదే సెంటిమెంట్‌ను గౌరవిస్తూ, కోట్లాది మంది ఇలవేల్పు అయిన తిరుమల శ్రీవారి పాదాల చెంత నుంచి తన రాజకీయ, సేవా ప్రస్థానాన్ని ప్రారంభించాలని జూనియర్ ఎన్టీఆర్ నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 18వ తేదీన తిరుపతిలోని ప్రతిష్టాత్మక తాజ్ హోటల్ వేదికగా ఆయన ఒక భారీ ప్రెస్ మీట్ నిర్వహించబోతున్నారు. ఈ వేదిక పైనుంచే 'ఊరువాడ' కార్యక్రమానికి సంబంధించిన పూర్తి విధివిధానాలను, వంద కోట్ల రూపాయల ఖర్చు వెనుక ఉన్న బ్లూ ప్రింట్‌ను, తన భవిష్యత్ కార్యాచరణను రాష్ట్ర ప్రజల ముందు ఉంచనున్నారు. ఈ పత్రికా సమావేశం కోసం జాతీయ మీడియా సైతం దృష్టి సారించింది. ఈ ఒక్క ప్రకటనతో ఎన్టీఆర్ తన రాజకీయ ఉద్దేశాలను కుండబద్దలు కొట్టబోతున్నారని, ఇది రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ సమీకరణాలను ఒక్కసారిగా మార్చివేస్తుందని విశ్లేషకులు బలంగా నమ్ముతున్నారు.

ఈ మొత్తం ఎపిసోడ్‌లో అత్యంత ఆసక్తికరమైన, మేధోపరమైన అంశం ఏమిటంటే.. జూనియర్ ఎన్టీఆర్ అనుసరిస్తున్న స్ట్రాటజీ అచ్చం తమిళనాడులో దళపతి విజయ్ అమలు చేసిన వ్యూహాన్ని పోలి ఉండటం. విజయ్ నేరుగా రాజకీయ పార్టీ (టీవీకే) పెట్టడానికి ముందు, తన అభిమాన సంఘాలను ఒక క్రమశిక్షణ కలిగిన సేవా సంస్థలుగా మార్చి, విద్యా పురస్కారాలు, అన్నదానాలు, ఉచిత వైద్య శిబిరాలతో దశాబ్దానికి పైగా ప్రజలకు సేవ చేశారు. తద్వారా సినిమా అభిమానులను బలమైన పొలిటికల్ కేడర్‌గా మార్చుకున్నారు. ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్ కూడా అదే అద్భుతమైన ఫార్ములాను ఏపీలో అమలు చేస్తున్నారు. 'ఊరువాడ' కార్యక్రమం ద్వారా తనకున్న కోట్లాది మంది అభిమానులను ఒక సామాజిక సైన్యంగా మలచబోతున్నారు. ఈ వ్యూహం వల్ల ఆయనపై కేవలం సినిమా యాక్టర్ అనే ముద్ర పోయి, ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడనే బలమైన ఇమేజ్ స్థిరపడుతుంది. విజయ్ ఎంట్రీతో తమిళనాడు రాజకీయాలు ఎలాగైతే షేక్ అయ్యాయో, జూనియర్ ఎన్టీఆర్ దెబ్బకు ఏపీలో అంతకు మించిన సుడిగాలి రావడం ఖాయం.

ఈ సంచలన ఎంట్రీతో ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రంలో రాబోయే మార్పులపై భారీ ఎత్తున విశ్లేషణలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో యువత, తటస్థ ఓటర్ల శాతం అత్యంత కీలకం. పాన్ ఇండియా స్టార్‌గా, అద్భుతమైన వక్తగా, అన్ని వర్గాలను ఆకర్షించగల మాస్ లీడర్‌గా జూనియర్ ఎన్టీఆర్‌కు ఉన్న ఇమేజ్ ఏ ఇతర నాయకుడికీ లేదు. ఆయన 100 కోట్లతో సేవా కార్యక్రమాలు మొదలుపెడితే, సాంప్రదాయ రాజకీయ పార్టీలు చేస్తున్న సంక్షేమ పథకాలకు దీటుగా ఒక సమాంతర ప్రజా సంక్షేమ వ్యవస్థను ఆయన సొంతంగా నిర్మించినట్లు అవుతుంది. ఇది అధికార, ప్రతిపక్ష పార్టీలకు తీవ్రమైన సవాలు విసురుతుంది. ముఖ్యంగా యువతలో ఒక సరికొత్త రాజకీయ ఉత్తేజం వస్తుంది. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా కేవలం అభివృద్ధి, సేవ అనే ఎజెండాతో ముందుకు వస్తున్న తారక్ ఎంట్రీ వల్ల రాబోయే రోజుల్లో ఓటు బ్యాంకు రాజకీయాలు పూర్తిగా మారిపోవడం తథ్యం. మొత్తం మీద చూసుకుంటే, జూనియర్ ఎన్టీఆర్ పొలిటికల్ ఎంట్రీ ఒక సాధారణ విషయం కాదు, అదొక రాజకీయ సునామీకి హెచ్చరిక. నందమూరి రామారావు వారసత్వాన్ని గుండెల్లో పెట్టుకున్న తెలుగు ప్రజలు, ఆయన రూపం, వాగ్ధాటి, పౌరుషం పుణికిపుచ్చుకున్న జూనియర్ ఎన్టీఆర్‌ను ఆధునిక రాజకీయ నాయకుడిగా గుండెల్లో పెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. సినిమా ప్లాట్‌ఫామ్‌పై తన సత్తా ఏమిటో దేశానికే చాటిచెప్పిన తారక్, ఇప్పుడు 'ఊరువాడ' అనే సామాజిక ఆయుధంతో రాజకీయ రణరంగంలోకి దిగుతున్నారు. ఈ నెల 18న తిరుపతిలో జరగబోయే ఆ మహా ఘట్టం, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ అధ్యాయంగా మిగిలిపోతుంది. తాతకు తగ్గ మనవడిగా, తెలుగు వారి ఆత్మగౌరవాన్ని మరోసారి జాతీయ స్థాయిలో నిలబెట్టే దిశగా జూనియర్ ఎన్టీఆర్ వేస్తున్న ఈ తొలి అడుగు తరువాత పరిణామాలపై ఆసక్తి నెలకొంది.

# పేపర్ లీకులు, అవినీతిపై కేంద్రం మౌనం వీడాలి

**భారత విద్యా వ్యవస్థపై రాహుల్ గాంధీ విమర్శలు..**

**ఢిల్లీ, మహా:** భారత విద్యా వ్యవస్థపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశ విద్యా వ్యవస్థ నిజాయతీ లేని దోపిడీ యంత్రాంగంగా మారిందని ఆరోపించిన ఆయన, వరుస ప్రశ్నపత్రాల లీకులు, అవినీతిపై కేంద్ర ప్రభుత్వం, కేంద్ర విద్యాశాఖ స్పందించడం లేదని విమర్శించారు.సోమవారం సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో చేసిన పోస్టులో రాహుల్ గాంధీ విద్యా వ్యవస్థపై తన అభిప్రాయాలను వెల్లడించారు. అవినీతి, అన్యాయం, పక్షపాతం, నిజాయితీ లేని వ్యవస్థ అనే పదాలు తనవి కావని, దేశవ్యాప్తంగా విద్యార్థులు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలేనని పేర్కొన్నారు.

విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేయాల్సిన విద్యా వ్యవస్థ వారిని, వారి కుటుంబాలను అప్పులు, మానసిక ఒత్తిడి, నిరాశ వైపు నెడుతోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశంలో కొనసాగుతున్న అవినీతే ప్రశ్నపత్రాల లీక్ మాఫియాకు ప్రధాన కారణమని, పోటీ పరీక్షల కోసం ఏళ్ల తరబడి శ్రమించిన లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ఈ మాఫియా ఒక్కసారిగా నాశనం చేస్తోందని విమర్శించారు.

ప్రశ్నపత్రాల లీకుల వంటి కీలక అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌనం వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికే కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని పేర్కొన్నారు. ఈ సమస్యలను ప్రశ్నించాల్సిన మీడియా కూడా దీర్ఘకాలంగా మౌనంగా ఉందని ఆయన విమర్శించారు.దేశ విద్యా రంగంలో సమూల మార్పులు అవసరమని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల 17న డెహ్రాడూన్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి హాజరై విద్యార్థుల గొంతుకను మరింత బలంగా వినిపిద్దామని కోరారు. కార్యక్రమానికి సంబంధించిన నమోదు వివరాలను కూడా తన 'ఎక్స్' పోస్టు ద్వారా ఆయన పంచుకున్నారు.

# ఆషాఢ బోనాల జాతరకు సర్వం సిద్ధం

**జూలై 16 నుండి ఆగస్టు 13 వరకు బోనాలు**



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల జాతరను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో బోనాల ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు ఆలయాలకు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

**జూలై 16న గోల్కొండ బోనాల ఉత్సవాలతో ప్రారంభం**

జూలై 20,21,22 తేదీల్లో బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవ ఉత్సవాల్లో భాగంగా ..20 న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఎదుర్కోలు ఉత్సవం ,21 నా అమ్మ వారికళ్యాణం, 22 నా రథోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. ఆగస్టు 2న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో బోనాలు ,ఆగస్టు 3న రంగం కార్యక్రమం. ఆగస్టు 9న హైదరాబాద్ నగరంలోని లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి బోనాలతో పాటు, నగరంలోని ప్రధాన దేవాలయాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు

బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్సవాల కోసం దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖ, రోడ్లు మరియు భవనాల శాఖ, ట్రాన్స్‌కో, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు, పౌర సరఫరాల శాఖ, టీజీఎస్ఆర్టీసీ, రైల్వే, సమాచార, పౌర సంబంధాల శాఖ, పురావస్తు శాఖతో పాటు ఇతర అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. దేవాలయాల వద్ద క్యూ లైన్లు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, రహదారుల మరమ్మతులు, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, భద్రత, ప్రత్యేక బస్సుల నిర్వహణ, పూల అలంకరణలు, విద్యుద్దీపాలంకరణలు వంటి అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

పాత జిహెచ్ఎంసి పరిధిలోని 3427 దేవాలయాలకు ప్రభుత్వం బోనాల ఉత్సవాల నిమిత్తం 15 కోట్ల 5 లక్షల 41 వేల 150 రూపాయలు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గారి ఆధ్వర్యంలో విడుదల చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బోనాల సందర్భంగా గోల్కొండ, ఉజ్జయిని మహంకాళి, చిలకలగూడ కట్ట మైసమ్మ పోచమ్మ, హరిబౌలిలోని అక్కన్న మాదన్న దేవాలయం, కార్వాన్ దర్బార్ మైసమ్మ, లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి, చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం, మీరాలం మండి శ్రీ మహంకాళి ఆలయాలతో పాటు నగరంలోని దాదాపు 30 ప్రధాన ఆలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు, ఇతర ముఖ్య నేతలు అధికారులు, సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు సమర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. బోనాల ఉత్సవాల అనంతరం ఫలహారం బండ్ల ఊరేగింపు జరగనుంది. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, భక్తులు ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించేందుకు పోలీసు, ప్రభుత్వ శాఖల సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి భక్తుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాలకు ఆర్టీసీ మహిళలకు ఉచిత బస్సులను నడిపిస్తున్నందున రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

## నిర్లక్ష్యం తగదు..
## ఫిర్యాదుల పరిష్కారమే ప్రాథమిక బాధ్యత

**ప్రజావాణిలో కలెక్టర్**



**ఆదిలాబాద్ మహా:** ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడం సంబంధిత అధికారుల ప్రాథమిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధి హామీ పథకం, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 85 ఫిర్యాదులు అందాయి. వీటిపై తక్షణ చర్యలు తీసుకుని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోపు పరిష్కరించాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని, అప్పీల్ కేసులను రెండు నుంచి మూడు రోజుల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్.ఎస్. చిత్రు, ఏవో వర్ణ,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తాడిచర్ల-2 ఓసి గని కేటాయింపు సింగరేణి చరిత్రలో మర్చిపోని ఘట్టం

- **మందమర్రి ఏరియాలో ఘనంగా విజయోత్సవ వేడుకలు**



**మందమర్రి, మహా :** తాడిచర్ల 2 ఓసి గనిని సింగరేణి సంస్థకు కేటాయించడం సింగరేణి చరిత్రలో మర్చిపోని ఘట్టమని మందమర్రి జిఎం ఎన్ రాధాకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక జిఎం కార్యాలయంలో జిఎం కార్యాలయ సిబ్బంది, అధికారులు, సింగరేణి గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) అధికారులతో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిఠాయిలను ఒకరికొకరు తినిపించుకుంటూ హర్షద్వానాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిచర్ల 2 బొగ్గు బ్లాక్ సింగరేణి బొగ్గు పరిశ్రమకు సుస్థిర భవిష్యత్తుకు బలమైన పునాదని వారన్నారు. రాబోయే రోజుల్లో బొగ్గు ఉత్పత్తి పెంపునకు, ఉద్యోగ భద్రతకు కార్మికుల సంక్షేమానికి ఈ బ్లాక్ ఎంతో దోహదపడుతుందని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేయడంలో ప్రతి అధికారి, ఉద్యోగి సమిష్టిగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కొత్త బ్లాక్ ద్వారా భవిష్యత్తు తరాలకు కూడా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వేడుకల సందర్భాన్ని పురస్కరించుకొని అన్ని విభాగాల్లో మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం జి.ఎల్. ప్రసాద్, సీఎంఓఏఐ ప్రతినిధి సరిత, డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, సీనియర్ పీఓ ఆర్. సత్యనారాయణలతో పాటు జీఎం కార్యాలయ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నైపుణ్యత బోధన అవసరం

- **మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య**



**మంచిర్యాల, మహా :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అత్యాధునిక విద్యను అందించాలంటే ఉపాధ్యాయులకు నైపుణ్యత బోధన అవసరమని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య అన్నారు.సోమవారం పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల సమగ్ర ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని బెల్లంపల్లి మండల విద్యాధికారి (ఎంఈఓ), ప్రాజెక్టు కోఆర్డినేటర్లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొంటున్న ఉపాధ్యాయులతో ముఖాముఖి మాట్లాడుతూ శిక్షణలో బోధిస్తున్న అంశాలు, అభ్యాస బోధన విధానాలు, తరగతి గదిలో వాటి అమలు, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదలకు చేపట్టాల్సిన చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం, నైపుణ్యాలను పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలతో పాటు విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకతను పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం శిక్షణ నిర్వహణ, హాజరు, శిక్షణా సామగ్రి, తరగతి నిర్వహణను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. శిక్షణ కార్యక్రమాలు లక్ష్యోద్దేశ్యాలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించబడేలా చర్యలు తీసుకోవాలని, శిక్షణ అనంతరం బోధనా విధానాల అమలును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బి.ఎల్.వో.లు ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజ్ వేగవంతం చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రజలకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను బి.ఎల్.వో.లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం చెన్నూర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసీల్దార్ మల్లికార్జున్ తో కలిసి డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 24వ లోగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని అధికారులకు సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల సేకరణలో బూత్ స్థాయి ఏజెంట్లు అధికారులకు సహకరించాలని సూచించారు. నింపిన ఫారాలలోని వివరాలను బూత్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు బి.ఎల్.వో.లయాప్ లో స్పష్టంగా నమోదు చేయాలని, అర్హత గల ఓటర్లు స్వయంగా ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని వివరించారు.ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చేపట్టాలని తెలిపారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించాలని, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. మండలంలోని సోమనపల్లిలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. చెన్నూర్ పట్టణంలో నిర్మిస్తున్న వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతిగృహం నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు నిరంతరంగా త్రాగునీటిని అందించేందుకు అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతే ముఖ్యం

**ప్రమాదాల నివారణపై ఎస్పీ సూచనలు**




**ఆదిలాబాద్ మహా:** విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేదని, పాఠశాలలు, కళాశాలలకు చెందిన ప్రతి బస్సు పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌తో పాటు అన్ని భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ అన్నారు. సోమవారం స్థానిక ఆదిలాబాద్ పట్టణంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రత, విద్యార్థుల రవాణా భద్రత, బస్సుల్లో జరిగే ప్రమాదాల నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది పాఠశాల, కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, విద్యార్థులను తరలించే ప్రతి బస్సు పూర్తి స్థాయి ఫిట్‌నెస్‌తో ఉండాలని, బస్సుల్లో తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు, ఎమర్జెన్సీ ఎగ్జిట్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ వంటి భద్రతా పరికరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి బస్సులో డ్రైవర్‌తో పాటు ఒక అటెండర్ తప్పనిసరిగా ఉండాలని, విద్యార్థులు బస్సు ఎక్కే సమయంలో, దిగే సమయంలో, ఇంటి వద్ద దింపే సమయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. బస్సు నడిపే ప్రతి డ్రైవర్‌కు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సరైన విశ్రాంతి, తగిన నిద్ర అనంతరమే విధులకు హాజరై వాహనాలు నడపాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని స్పష్టం చేసిన జిల్లా ఎస్పీ, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడిన డ్రైవర్లపై మాత్రమే కాకుండా సంబంధిత పాఠశాల లేదా కళాశాల యాజమాన్యంపైనా చట్టపరమైన కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. జాతీయ రహదారులపై అతివేగం అత్యంత ప్రమాదకరమని, సమయానికి పాఠశాలకు చేరుకోవాలనే ఉద్దేశంతో వేగంగా బస్సులు నడపడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదన్నారు. రాంగ్ సైడ్, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, నిర్లక్ష్యంగా ఓవర్‌టేక్ చేయడం వంటి చర్యలు తీవ్ర ప్రమాదాలకు దారితీస్తాయని పేర్కొన్నారు. రైల్వే గేట్ల వద్ద ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, గేట్లు మూసి ఉన్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించరాదని సూచించారు. విద్యార్థులు ప్రయాణించే సమయంలో వారు బస్సు కిటికీల్లో నుంచి చేతులు, తలలు బయటకు పెట్టకుండా డ్రైవర్, అటెండర్ నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. "చిన్నారుల ప్రాణాలు, వారి భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆశలు మీ చేతుల్లో ఉంటాయి. మీరు నడిపేది కేవలం బస్సు కాదు... అనేక కుటుంబాల భవిష్యత్తు. అందుకే ప్రతి ప్రయాణాన్ని అత్యంత బాధ్యతతో, అప్రమత్తంగా నిర్వహించాలి" అని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, టౌన్ సీఐలు బి. సునీల్ కుమార్, కె. నాగరాజు, ప్రణయ్ కుమార్, ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, బస్సు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై న్యాయం జరిగే వరకు పోరాటం

- **మంత్రి గడ్డం వివేక్**
- **మద్దెల శివకుమార్ సేవలు అభినందనీయం**
- **అతిథులకు మద్దెల ఆధ్వర్యంలో ఘన సన్మానం**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఎస్సీ వర్గీకరణలో మాలలకు అన్యాయం జరిగిందని వర్గీకరణ శాస్త్రీయ బద్ధంగా జరగలేదని రోస్టర్ పాయింట్లలో కూడా మాలలకు అన్యాయం జరిగిందని జరిగిందని తప్పకుండా ఈ అన్యాయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో పాటుగా వర్గీకరణ అసెంబ్లీ సబ్ కమిటీలోని ఉత్తమ కుమార్ రెడ్డితో కూడా మాట్లాడి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని మంత్రి గడ్డం వివేక్ అన్నారు. తనకు అత్యంత సన్నిహితుడైన ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ గృహానికి మంత్రి వివేక్ చేరుకొని పలు విషయాలపై చర్చించడం జరిగింది. అంబేద్కర్ ఆశయాల వారసుడు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ తోపాటు అనేక జాతీయ రాష్ట్ర అవార్డులను అమెరికన్ యూని వర్సిటీస్ నుండి డాక్టరేట్ ను పొందిన ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ఎంతో అభినందనీయుడని మంత్రి వివేక్ పేర్కొన్నారు. మద్దెల శివకుమార్ గత 30 సంవత్సరాలుగా తనకు ఎంతో సన్నిహితుడని 198082లో చిక్కడపల్లిలోని మా అంబేద్కర్ కాలేజీలోనే ఇప్పటి తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ చీఫ్ మినిస్టర్ మల్లు భట్టి విక్రమార్క, మద్దెల శివకుమార్ లు ఇంటర్మీడియట్ విద్యనభ్యసించారని ఆ కృతజ్ఞతతో అప్పటినుండి తన పట్ల ఎంతో గౌరవంతో మద్దెల ఉంటాడని అన్నారు. తాను తెలంగాణ రాష్ట్ర సలహాదారులుగా ఉన్నప్పుడు మద్దెల ఆధ్వర్యంలో నిర్వహించే "తెలంగాణ బాలోత్సవ్" కు తనను ముఖ్య అతిథిగా ఆహ్వానించడం జరిగిందని చెప్పారు. ఇంతటి పేరు ప్రతిష్టలు సామాజిక సేవా తత్పరత కలిగిన ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మన తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని తెలంగాణ రాష్ట్ర కార్మిక ఉపాధి ఫ్యాక్టరీలు గనులు జియాలజి శాఖల మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకట స్వామి ఉద్ఘాటించారు. అనంతరం కార్యక్రమరూపశిల్పి ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ తాను మొట్టమొదట అంబేద్కర్ పేరు విన్నది అన్న అంబేద్కర్ కాలేజీలో చేరినప్పుడే అని పేర్కొన్నారు. ఆ ఫౌండేషన్ తోనే, అంబర్పేట్ లోని నింబోలి అడ్డ సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో మనం తెలంగాణ డిప్యూటీ చీఫ్ మినిస్టర్ మల్లు భట్టి విక్రమార్క తాను కలిసి చదువుకుంటున్నప్పుడు అక్కడ అంబేద్కర్ భావజాలాన్ని, అంబేద్కర్ సిద్ధాంతాలను అవపోసన పెట్టడం జరిగిందని అప్పటినుండి ఇప్పటివరకు ఆయన సిద్ధాంతాలను దశ దిశలా వ్యాపింపజేస్తూ పే బ్యాక్ టు ద సొసైటీకి కట్టుబడి జీవిస్తున్నానని చెప్పారు. గడ్డం వివేక్ అభినవ అంబేద్కర్ అని రాజకీయంగా పరిపాలనలో ఇంకా ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన నాయకత్వంలోనే ఎల్లప్పుడూ విధేయులమై పనిచేస్తామని నొక్కి వక్కాణించారు.అందుకు వారికి ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటానని తెలిపారు. తొలుత ఇటీవల పరమపదించిన ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ సతీమణి దివంగత ఎస్తేర్ రాణి చిత్రపటానికి మంత్రి డాక్టర్ వివేక్, ఎమ్మెల్యే రాగమయి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ నేతృత్వంలో భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం నాయకులందరితో కలిసి మంత్రి గడ్డం వివేక్ కి శాలువాలు కప్పి, గజమాలను వేసి రాజ తలపాగాను ధరింపజేసి ప్రత్యేకంగా తయారు చేసిన మెమెంటోను బహుకరించి, ఘనంగా సత్కరించి అభినందించారు. హాజరైన గౌరవ అతిథులందరికీ శాలువాలను కప్పి ఘనంగా సత్కరించి అభినందించారు.

## సీఎంపై కేసు నమోదు చేయాలి: హరీశ్ రావు

- **షాబాద్ ఘటనపై సీఎం వ్యాఖ్యలపై విమర్శలు**
- **సంగమేశ్వర–బసవేశ్వర పాదయాత్ర ప్రకటన**
- **కాంగ్రెస్ హామీలు అమలు కాలేదని ఆరోపణ**




హైదరాబాద్, మహా: రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు ఆరోపించారు. షాబాద్ సామూహిక హత్యల ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని పేర్కొంటూ, చట్టం ముందు అందరూ సమానమేనని, డీజీపీ వెంటనే ముఖ్యమంత్రిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం, సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.
రాష్ట్రంలో పోలీసులు రాజకీయ కక్షసాధింపులకు మాత్రమే పరిమితమయ్యారని, ప్రజల భద్రతను విస్మరించారని హరీశ్ రావు విమర్శించారు. షాబాద్ ఘటనలో కాంగ్రెస్ నాయకత్వంపై కూడా ఆరోపణలు చేస్తూ, ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కరువు, సాగునీటి సమస్యలు, సింగూరు ప్రాజెక్టు మరమ్మతులు, రైతుల ఇబ్బందులపై ప్రభుత్వం విఫలమైందని, ఎన్నికల హామీలైన రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, మద్దతు ధర, బోనస్ వంటి అంశాలు అమలు కాలేదని విమర్శించారు.
విద్యారంగంలోనూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందడం లేదని ఆరోపించిన హరీశ్ రావు, నారాయణఖేడ్-ఆందోల్ ప్రాంతాల సాగునీటి అవసరాల కోసం సంగమేశ్వర-బసవేశ్వర ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో త్వరలో బసవేశ్వర విగ్రహం నుంచి సంగమేశ్వర ప్రాజెక్టు వరకు భారీ పాదయాత్ర చేపడతామని ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు గట్టి గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు.

## జూలై 24లోగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయడమే లక్ష్యం

- **అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో జిల్లా యంత్రాంగం విస్తృత చర్యలు – జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి** మహా:ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్-2026) ప్రక్రియ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్-2026) ప్రక్రియను జూలై 24 చివరి తేదీలోగా పూర్తి చేయడం జిల్లా యంత్రాంగం లక్ష్యమని తెలిపారు. ఇందుకోసం జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, క్షేత్రస్థాయి సిబ్బంది, స్థానిక సంస్థల సిబ్బంది, ప్రత్యేక బృందాలను సమన్వయంతో వినియోగిస్తూ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, పరిశీలన, డిజిటైజేషన్ పనులను వేగవంతంగా చేపడుతున్నట్లు తెలిపారు.ఎస్ఐఆర్ (ఎస్ఐఆర్-2026) ప్రక్రియపై అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి ప్రత్యేక ఓరియెంటేషన్ కార్యక్రమాలు నిర్వహించి, ప్రక్రియ నిర్వహణ, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, పరిశీలన, డిజిటైజేషన్ తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో సమన్వయంతో విధులు నిర్వహించేలా అవసరమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.ప్రతి అర్హత గల ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం చేరేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. ఫారాలు పూర్తి వివరాలతో సేకరించి, నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తిచేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందన్నారు.అర్హులైన ఓటర్లు ఎవరూ ఈ అవకాశాన్ని కోల్పోకుండా జూలై 24లోగా తమ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి వివరాలతో సంబంధిత బూత్ లెవల్ అధికారులకు (బిఎల్ఓ) తప్పనిసరిగా అందజేసి ఎన్నికల ప్రక్రియకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్-2026) ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## టీజీ టెట్–2026 ఫలితాలు విడుదల

**43.94 శాతం ఉత్తీర్ణత నమోదు**
**50,544 మంది అభ్యర్థులు అర్హత**

హైదరాబాద్, మహా: తెలంగాణ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీజీ టెట్-2026) ఫలితాలను పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ సోమవారం విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 16 నుంచి 22 వరకు పది సెషన్లలో నిర్వహించిన ఈ పరీక్షకు 1,53,752 మంది దరఖాస్తు చేసుకోగా, 1,15,028 మంది హాజరయ్యారు. వారిలో 50,544 మంది అర్హత సాధించగా, మొత్తం ఉత్తీర్ణత శాతం 43.94గా నమోదైంది. అభ్యర్థులు తమ హాల్‌టికెట్ నంబర్ ఆధారంగా అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలు, మార్కులు, అర్హత వివరాలను పరిశీలించుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈసారి మహిళా అభ్యర్థులు అన్ని విభాగాల్లో పురుషుల కంటే మెరుగైన ఫలితాలు నమోదు చేయడం విశేషంగా నిలిచింది. సామాజిక వర్గాల వారీగా ఎస్టీ అభ్యర్థులు 51.03 శాతం ఉత్తీర్ణతతో తొలి స్థానంలో నిలవగా, బీసీ అభ్యర్థులు 40.36 శాతం ఉత్తీర్ణత సాధించారు. పేపర్-1, పేపర్-2ల్లో ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులు కూడా అర్హత సాధించినట్లు అధికారులు వెల్లడించారు.



## నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

**నిర్మల్ మహా:** 1 నుంచి 19 సంవత్సరాల వయసు ఉన్న వారందరికీ నులిపురుగుల నివారణ ఆల్బెండజోల్ మాత్రలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం నిర్మల్ అర్బన్ మండలం సోఫీనగర్ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అంతర్జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆల్బెండజోల్ మాత్రల వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. ఆల్బెండజోల్ మాత్రల వల్ల నులిపురుగులు నశించి, రక్తహీనత రాకుండా ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం విధిగా మాత్రలను తీసుకోవాలని అన్నారు. విద్యార్థులంతా ఆహారం తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అనారోగ్యానికి గురికాకుండా ఉండేలా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, డీఈవో భోజన్న, ఇమ్యూనైజేషన్ అధికారి నయనా రెడ్డి, అధికారులు రవీందర్, ప్రిన్సిపల్స్ డానియల్, తదితరులు పాల్గొన్నారు.

## ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసిన సర్పంచ్

**కారేపల్లి, మహా :** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కారేపల్లి హై స్కూల్, మోడల్ స్కూల్ లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల (ఆల్బెండజోల్)ను సోమవారం సర్పంచ్ మేదరి వీర ప్రతాఫ్ (టోనీ), మండల వైద్యాధికారి డాక్టర్ బీ.సురేష్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మేదరి టోనీ, వైద్యాధికారి డాక్టర్ సురేష్ లు మాట్లాడుతూ నులిపురుగులతో పిల్లలో అకలి మందగించటం, ఎదుగుదల లోపించటం, రక్తహీనతకు గురికావటం జరిగుతుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించటంలో వలన వ్యాధులు దరిచేరవన్నారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, లలిత, అనిత, దేవ కరుణ తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల పరిధిలోని సాయిరాం తండా, దండుమిట్ట తండా నడుమ ఖమ్మం, కొత్తగూడెం ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే యువకుడు మృతి చెందిన సంఘటన జరిగింది. స్థానికుల సమాచారం ప్రకారం కొత్తగూడెం పట్టణానికి చెందిన ఎస్ కె అంజద్ (23) అనే యువకుడు పల్సర్ ద్విచక్ర వాహనంపై ఖమ్మం నుండి కొత్తగూడెం వైపు వస్తుండగా, మండల పరిధి సాయిరాం తండా, దండు మిట్ట తండా మధ్య ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగి మృతి చెందినట్లు తెలిపారు. కానీ గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టిందా..? అతివేగం, స్వీయ తప్పిదం వల్ల ప్రమాదం జరిగి ఉంటుందా..? అనే విషయాలు తెలియాల్సి ఉంది. ప్రమాద విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# మరువ లేని మన జానకమ్మ



లక్ష్మీ, సరస్వతి కటాక్షం పొందాలి అంటే రాసి పెట్టి ఉండాలి అంటారు పెద్దలు. ఇక ఆ కళామతల్లి ఆశీస్సులు కావాలి అంటే... ఏ పూలతో ఆమెకు పూజ చేయాలో మరి. ఆమెకు మాత్రం ఆ సరస్వతి దేవి పూర్తి దీవెనలు లభించాయి. అందుకే ఆమె కారణ జన్మురాలు అయ్యారు. మధుర గాయని ఎస్. జానకీ గురించి చెప్పుకోవాలి అంటే అందుకు మాటలు చాలవు. ఆమె గొంతుకలో ఓ కోకిల జీవం పోసుకుంది. హై పిచ్ స్వరంలో పాట పాడాలి అంటే జానకి తప్పా మరొకరు సంగీత దర్శకులకు గుర్తు వచ్చే వారు కారంటే ఆమె స్వరం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది. ఎస్. జానకి విషయంలో ఇది అక్షర సత్యమైంది. సంగీత స్వరాలు ఆమె గొంతులో నాట్యం చేశాయి. ఇది నూటికి నూరుపాళ్ళు ఆ సరస్వతి దేవి అనుగ్రహం మాత్రమే. నాదస్వరంతో జత కట్టి ఎస్. జానకి పాడిన నీ లీల పాడేద దేవా పాట ఎన్ని సార్లు విన్నా ఇంకా, ఇంకా వినాలి అన్పితుందంటే అది జానకి ◌ంఠం మర్మమే.కాలం చాలా విచిత్రమైంది. అమూల్యమైంది. అంతే కాదు అన్నింటిని రుచి చూపించి అంతలోనే మాయం చేస్తుంది. ఓ ఘంటసాల, ఓ ఎస్. పి. బాలు, పీ. లీలా, జిక్కి, భానుమతి, బాల సరస్వతి, ఓ ఎస్. జానకి...ఇలా ఎందరో, ఎందరెందరో మధుర గాయకులను అందించిన కాలం వారి గానామృతాన్ని ఆస్వాదిస్తున్న సమయంలోనే విషాదాన్ని మిగులుస్తోంది. మహా మహులు ఒకరొకరుగా కాలగర్భంలో కలిసి పోతుండటం సంగీత ప్రియులకు తీరని వ్యధ మిగులుస్తూనే వుంది. కళామతల్లి కృప కలగటం ఓ అద్భుతమైన వరం. అలాంటి వరం పొందిన గాయని ఎస్. జానకి. పాట ఏదైనా, ఏ భాషలో అది వున్నా దాన్ని ఒడిసి పట్టుకొని తన కంఠంలో దాన్ని రంగరించి రక్తి కట్టించిన గాన కోకిల ఆమె.

సమయం, సందర్భం, రాగం, భావం, పద ఉచ్చరణ, శ్రుతి, లయ ఇవి పాటకు ప్రాణం పోస్తాయి. వీటిని అర్థం చేసుకొని, అందులో పరకాయ ప్రవేశం చేసి పాడటం అంత సులువు కాదు. అది శృంగారం అయినా, విషాదం అయినా, హాస్యమైన, ఆనందమైన ఇలా ఆయా సన్నివేశాలకు అనుగుణంగా పాటను తన గొంతులో ఇమడ్చి, దానికి పూర్తి న్యాయం చేసిన గాయని జానకి అంటే అది అతిశయోక్తి కాదు. పదహారేళ్ళ పడుచు తన జీవిత భాగస్వామి కోసం ఎదురు చూస్తూ తన మనసులో భావం వ్యక్తికరించిన పాట సిరిమల్లె పువ్వా గేయం జానకి కంఠంలోని గొప్పతనం చాటే ఓ మచ్చు తునక. సందేపొద్దులకాడ సంపంగి నవ్వింది అంటూ పాడినా, నీ ఆశ, ఆడి ఆశ అంటూ నిర్వేదం వ్యక్తం చేస్తూ ఆలాపించిన ఆమె కంఠం పగలే వెన్నెల, జగమే ఉయ్యాల అంటూ సంగీత ప్రియులకు మరిచి పోనీ, మరపురాని ఎన్నో, ఎన్నెన్నో అనుభూతులు మూట కట్టి ఇచ్చింది.

కొన్నింటికి మనం విలువ కట్టలేం. కట్టాలి అని ప్రయత్నం చేసినా అది వృధా ప్రయాస మాత్రమే అవుతుంది. అలాంటి మధురమైనదే ఎస్. జానకి కంఠం. పుట్టిన మూడేళ్ళ ప్రాయం నుంచే ఆమె కంఠం పాటల పల్లకి అయింది. దక్షిణ భారతంలోనే కాదు, ఉత్తరాది భాషల్లో కూడా ఆమె పాడిన పాటలు ఆణిముత్యాలుగా నిలిచి పోయాయి. జీవితంలో ఎత్తు, పల్లాలు సహజం. జానకి కూడా ఇలాంటి ఇబ్బందులు ఎదురుకున్నారు. అయినా పాటల విషయానికి వచ్చే సరికి అన్నీ మరిచి పోయి ఆ పాటకు న్యాయం చేయటం ఆమెకే చెల్లింది. కవులు, సినీ గేయ రచయితలు ఎంత గొప్ప సాహిత్యాన్ని రంగరించి, అద్భుతమైన పదాలను జోడించి పాటలు రాసినా గాయకులు దాన్ని ఆకళింపు చేసుకొని పాడినప్పుడే అది జనం హృదయాలను కదిలిస్తుంది. ఇలా పాటను అర్థం చేసుకొని పాడటంలో ఎస్. జానకి మేటి. ఆమెకు ఆమె సాటి.

ఓ సంగీత మేరు పర్వతం కూలి పోయింది. ఓ గానామృతం గిన్నె ఒరిగి పోయింది. గాన గాంధర్వి ఎస్. జానకి కంఠం మూగబోయింది. సంగీత ప్రియుల గుండెల్లో వేదన మిగిలింది. మృత్యుదేవతకు కరుణ లేదు. కాలచక్రంతో కలిసి కాటు వేయటం మాత్రమే తెలుసు. మనుషులను, మనసులను రంజింపజేసిన మధురగాయకులు ఇప్పుడు ఓ జ్ఞాపకాలుగా మిగిలి పోతున్నారు. ఆ అమరులు లేక పోయినా వారు అందించిన మధురమైన పాటలు మన మదిలో చిరస్మరణీయంగానే మిగిలి పోతాయి. జానకమ్మ అందించిన ఆమె పాటలు సూర్య, చంద్రులు ఉన్నత వరకు చిరస్థాయిగా నిలిచే ఉంటాయి...ఇది మన జానకమ్మ పాడిన పాటగా ఎప్పుడు మదిలో నిలిచి పోతాయి...



**జీ. వెంకటరమణ.**
**సీనియర్ జర్నలిస్ట్.**

# కన్నీటి విత్తనం నుండి ఆత్మగౌరవ వృక్షంగా

## తెలంగాణ ఆయిల్ పామ్ రైతుల ఉద్యమ ప్రస్థానం.

◌లెంగాణ నేలపై ఆయిల్ పామ్ సాగు ఒక అద్భుతమైన ప్రయాణం. దశాబ్దాల క్రితం మొదలైన ఈ సాగు, ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని నేడు ఒక మహోద్యమంగా మారింది. కేవలం పంట పండించడమే కాకుండా, తమ హక్కుల కోసం, వ్యవస్థలోని అవినీతిపై ఉక్కుపాదం మోపడం కోసం రైతులు ఏకమై ఒక మహాశక్తిగా ఎదిగిన తీరు యావత్ దేశానికే ఆదర్శం. ఒకప్పుడు ఫ్యాక్టరీల వద్ద క్యూ లైన్లలో పడిగాపులు కాసిన రైతులు, నేడు ఢిల్లీ పీఠాన్ని కదిలించే స్థాయికి ఎదగడం వెనుక ఎంతో పోరాటం, మరెంతో వ్యధ దాగి ఉన్నాయి.

**సాగుకు బీజం.. ఫ్యాక్టరీల కోసం నిరాహార దీక్షలు**

తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు చరిత్ర 1993వ సంవత్సరంలో అశ్వారావుపేటలో ప్రారంభమైంది. 2002 నాటికి సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ, స్థానికంగా ఫ్యాక్టరీ లేకపోవడంతో రైతులు పశ్చిమ గోదావరి జిల్లాలోని పెద్దవేగికి తమ పంటను తరలించాల్సిన దుస్థితి ఉండేది. ఈ కష్టాలను గమనించిన అప్పటి ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం, శాసనసభ్యులు జలగం వెంకటరావు కృషితో 2006లో ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ రంగంలో (ఆయిల్ ఫెడ్) మొట్టమొదటి ఫ్యాక్టరీని గంటకు 5 టన్నుల సామర్థ్యంతో ప్రారంభించింది. దీంతో రైతులు మరింత ఉత్సాహంగా తోటలు పెంచడం మొదలుపెట్టారు.

సమయం గడిచేకొద్దీ పండుతున్న పంటకు, ఫ్యాక్టరీ సామర్థ్యానికి పొంతన లేకుండా పోయింది. 2015 నాటికి ఫ్యాక్టరీ సామర్థ్యాన్ని 30 టన్నులకు పెంచినప్పటికీ, దిగుబడులను ప్రాసెస్ చేయలేక ట్రాక్టర్లు రోజుల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి దాపురించింది. ఆ గడ్డు కాలంలో ఆయిల్ పామ్ రైతులు అఖిలపక్ష నాయకులతో కలసి, రెండవ ఫ్యాక్టరీ నిర్మించాలని డిమాండ్ చేస్తూ 24 సెప్టెంబర్ 2015న అశ్వారావుపేట ఫ్యాక్టరీ గేటు ముందు 8 రోజుల పాటు నిరాహార దీక్షకు దిగారు. రైతుల ఆవేదనను అర్థం చేసుకున్న అప్పటి కేబినెట్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , దమ్మపేట మండలం అప్పారావుపేటలో గంటకు 30 టన్నుల సామర్థ్యంతో రెండవ ఫ్యాక్టరీని మంజూరు చేయించారు. 2018లో పూర్తయిన ఈ ఫ్యాక్టరీ అత్యుత్తమ ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేట్ సాధించడంతో పాటు, అంతర్జాతీయంగా ధరలు పెరగడంతో ఈ ప్రాంతంలో సాగు విపరీతంగా ఊపందుకుంది.

**అవమానాల పునాదుల మీద...**

2020లో ఆయిల్ పామ్ ధరలు అనూహ్యంగా పెరగడంతో రైతులు పెద్ద ఎత్తున సాగుకు ముందుకొచ్చారు. కానీ, అప్పుడే వ్యవస్థలోని డొల్లత బయటపడింది. మొక్కల కొరత ఏర్పడటం, ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీలో అవినీతి, ట్రాక్టర్ల సీరియల్‌లో అక్రమాలు, నకిలీ ఎఫ్ కోడ్ తో ఆంధ్ర ప్రాంత పండ్లను కొనుగోలు చేయడం, ఇక్కడి రైతులకు దక్కాల్సిన మొక్కలను అక్రమంగా పక్క రాష్ట్రానికి తరలించడం వంటి దుర్మార్గాలు చోటుచేసుకున్నాయి.

2019కి పూర్వం ఆయిల్ ఫెడ్ చైర్మన్లుగా కేవలం ఐఏఎస్ అధికారులు మాత్రమే ఉండేవారు. కానీ అప్పటి ప్రభుత్వం రాజకీయ నాయకులకు అవకాశం కల్పించింది. తమ సమస్యలు చెప్పుకుందామని వెళ్లిన రైతు ప్రతినిధులతో అప్పటి ఆయిల్ ఫెడ్ ఎండి, చైర్మన్ చులకనగా, హేళనగా మాట్లాడారు. కోఆపరేటివ్ ఫెడరేషన్, రైతు భాగస్వామ్య సంస్థ అనే కనీస విచక్షణ మరిచి ప్రైవేటు ఫ్యాక్టరీ ప్రతినిధుల్లా వారు ప్రవర్తించిన తీరు రైతులను తీవ్ర మనస్తాపానికి గురిచేసింది. ఆ అవమానమే ఆయిల్ పామ్ రైతులను ఏకం చేసింది. దీని ఫలితంగా అక్టోబర్ 2, 2022 గాంధీ జయంతి రోజున "తెలంగాణ ఆయిల్ ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్ పామ్ గ్రోవర్స్ సొసైటీ" (రిజిస్టర్ నెంబర్: 168/22)లాంఛనంగా ఆవిర్భవించింది.



***అవినీతిపై ఎక్కుపెట్టిన అస్త్రం***

సంఘం ఏర్పడిన నాటినుండి అధికారుల అక్రమాలపై అలుపెరగని పోరాటం సాగిస్తోంది. నకిలీ ఇన్వాయిస్‌లతో పండ్లు కొనకుండానే కొన్నట్లు చూపించడం, ఒకే లారీని వేర్వేరు రైతుల పేరు మీద నమోదు చేసి ప్రైవేటు ఫ్యాక్టరీలతో కుమ్మక్కై ఓ ఈ ఆర్ తగ్గించడం, ఫేక్ కోడ్‌లతో సొమ్ము దారి మళ్లించడం వంటి వాటిపై సంఘం న్యాయపోరాటం చేసింది. అధికారులకు అనుకూలమైన వారి ట్రాక్టర్లను ముందుగా పంపే విధానాన్ని అడ్డుకుని, సీరియల్ ప్రకారమే పంపేలా సాధించింది. ఆయిల్ ఫెడ్ అధికారుల కనుసన్నల్లో క్రూడ్ ఆయిల్ ట్యాంకర్లు దొంగతనంగా అమ్ముతుండగా పట్టుకుని పోలీసు కేసు నమోదు చేయించింది. అలాగే అశ్వారావుపేట, జనగాం నర్సరీల నుండి ఆంధ్రాకు అక్రమంగా తరలిస్తున్న మొక్కల లారీలను సైతం పట్టుకుని క్రిమినల్ కేసులు పెట్టించింది.

**ప్రభుత్వాల నిర్లక్ష్యం...పాలకుల వద్దకు చేరిన పోరు**

ఈ సమస్యపై ఆయిల్ ఫెడ్ వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శికి, హార్టికల్చర్ కమిషనర్‌కి, వ్యవసాయ మంత్రికి విజ్ఞప్తి చేసినా రెండేళ్లపాటు బుట్టదాఖలు చేశారు. రైతుల యాజమాన్య లోపం వల్లే కాయలు రావట్లేదని అధికారులు బుకాయించారు. ఆయిల్ ఫెడ్ చైర్మన్ శ్రీ జంగా రాఘవరెడ్డి శాస్త్రవేత్తలతో 18 తోటలు తిరిగి జన్యుపరమైన లోపమేనని అంగీకరించినా, చట్టంలో నష్టపరిహారం ఇచ్చే వెసులుబాటు లేదని చేతులెత్తేశారు. రేగెళ్ళపాడు నర్సరీలో ఉన్న 3 లక్షల తంబా రకం మొక్కలు లోపభూయిష్టమైనవని మొత్తుకున్నా, చైర్మన్ వినకుండా వాటిని రైతులకు

### జన్యుపరమైన లోపాలు కుప్పకూలిన రైతుల ఆశలు

రైతు సంఘం చేసిన పోరాటాల్లో అత్యంత కీలకమైనది జన్యుపరమైన లోపం (కర్లింగ్) ఉన్న మొక్కలను గుర్తించడం. నారాయణపురానికి చెందిన పుచాయకాయల సోమిరెడ్డి తోటలో 60 శాతం మొక్కలు కాయకపోవడాన్ని బట్టి, ఆయిల్ పామ్‌లో కూడా కాయని మొక్కలు ఉంటాయన్న చేదు వాస్తవాన్ని సంఘం వెలుగులోకి తెచ్చింది. 2016 నుండి 2022 వరకు అశ్వారావుపేట నర్సరీ ఇచ్చిన మొక్కల్లో మహబూబాబాద్, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఏకంగా 30 నుండి 98 శాతం వరకు మొక్కలు కాపుకు రాలేదని పైలట్ ప్రాజెక్టుల ద్వారా ఆధారాలతో సహా నిరూపించింది.ఈ మహమ్మారికి ప్రధానంగా మూడు రకాల అవకతవకలే కారణమని సంఘం గుర్తించింది. మొదటిది, ఐఐఓపీఆర్ మార్గదర్శకాల ప్రకారం నాశనం చేయాల్సిన ఆఫ్‌టైప్ (కర్లింగ్, ఎరెక్ట్ గ్రోత్) మొక్కలను, అధికారుల నిర్లక్ష్యంతో హానికర గ్రోత్ హార్మోన్లు చల్లి రైతులకు అంటగట్టడం. రెండవది, డిమాండ్ ఉన్న సమయంలో నర్సరీ సిబ్బంది మంచి మొక్కలను పక్క రాష్ట్రాలకు అమ్ముకుని, లెక్కలు సరిచేయడానికి తోటల్లో రాలి మొలిచిన నాసిరకం మొక్కలను నర్సరీలో కలపడం. మూడవది, అత్యంత దారుణమైన కుంభకోణం. అధికారులు ఇంపోర్టెడ్ విత్తనాలను పక్క రాష్ట్రాల ప్రైవేటు కంపెనీలకు అమ్ముకుని, బదులుగా అశ్వారావుపేటలో కేవలం 800 రూపాయలకు గెలలు కొని, ఆంధ్రాలో మొలకెత్తించి తిరిగి ఇక్కడి రైతులకు అంటగట్టారు. ఇందులో విదేశాల నుండి సీడ్ ఇంపోర్ట్ చేసే బ్రోకర్ల పాత్ర కూడా దాగి ఉంది.

### వాస్తవాలను ధృవీకరించిన జాతీయ శాస్త్రవేత్తలు

కేంద్ర మంత్రి ఆదేశాలతో ఐఐఓపీఆర్ శాస్త్రవేత్తల బృందం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఐదు రోజులపాటు 27 తోటలను పరిశీలించి 200 శాంపిల్స్ సేకరించింది. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా ఇన్ని జన్యుపరమైన లోపాలు ఉన్న మొక్కలను చూసి వారు విస్తుపోయారు. నర్సరీ దశలోనే నాశనం చేయాల్సిన మొక్కలను రైతులకు ఇవ్వడం ఆయిల్ ఫెడ్ తీవ్ర నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని స్పష్టం చేశారు. ఈ పోరాటానికి సీపీఎం, బీజేపీ, భారతీయ కిసాన్ సంఘ్ వంటి సంస్థలు మద్దతు పలికాయి. 30 ఏళ్ల దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్ పామ్‌ను నూతన తెలంగాణ విత్తన చట్టంలో చేర్చాలని కోదండ రెడ్డి కమిటీకి విజ్ఞప్తి చేసినా, ప్రైవేటు కంపెనీలకు కొమ్ముకాస్తూ ప్రభుత్వం ఆ అభ్యర్థనను తోసిపుచ్చడం శోచనీయం.

ఇచ్చి తీరుతామని మొండికేయడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనం.

స్థానికంగా న్యాయం జరగకపోవడంతో జూలకంటి రంగారెడ్డి సాయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి సమస్యను వివరించారు. అక్కడితో ఆగకుండా, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ద్వారా ఢిల్లీ వెళ్లి కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కి రాష్ట్ర రైతాంగం గోడును వెళ్లబోసుకున్నారు. 100 మంది రైతుల తోటలను ఐఐఓపీఆర్ శాస్త్రవేత్తలతో పరిశీలింపజేసి నష్టపరిహారం ఇప్పించాలని కోరారు.

అదే సమయంలో 40,000 ఎకరాల్లో సాగు చేస్తున్న 6000 మంది గిరిజన రైతుల పక్షాన, సంఘం సభ్యులు కారం శ్రీరాములు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. విచారణలో రాష్ట్ర అధికారులు సర్టిఫైడ్ మొక్కలే ఇచ్చామని కమిషన్‌ను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించినా, రైతు సంఘం డాక్యుమెంటరీ ఆధారాలతో వారి బండారం బయటపెట్టింది. మూడేళ్ల లోపు తోటలను అధికారుల ఖర్చుతో తొలగించి కొత్త మొక్కలు నాటాలని, నాలుగేళ్లు పైబడిన తోటలకు ఎకరానికి లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని బలంగా వాదించింది. రైతులతో ఏకీభవించిన ఎస్టీ కమిషన్, ఒక నెల రోజుల్లో శాస్త్రవేత్తలతో విచారణ జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించింది.

**హక్కుల సాధనే లక్ష్యంగా..**

కొన్ని జిల్లాలకు పరిమితమైన సంఘం, నేడు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి సమష్టి భాగస్వామ్యంతో ఆయిల్ పామ్ రాష్ట్ర సంఘంగా ఏర్పడబోతోంది. దేశం వంట నూనెల రంగంలో స్వయంసమృద్ధి సాధించడంలో కీలకంగా వ్యవహరిస్తూనే, రైతుల అభ్యున్నతి కోసం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

జన్యుపరమైన లోపాలతో నష్టపోయిన రైతులకు పరిహారం సాధించడం, నాణ్యమైన మొక్కలు ఇవ్వని కంపెనీల నుండి నష్టపరిహారం రాబట్టేలా విత్తన చట్టంలో ఆయిల్ పామ్‌ను చేర్చడం సంఘం ప్రాథమిక లక్ష్యాలు. పండ్లు కొనుగోలు చేసేటప్పుడు ప్రైవేటు కంపెనీలు సాగిస్తున్న దోపిడీ (తరుగు తీసే విధానాన్ని) అడ్డుకోవడానికి పోరాటం కొనసాగుతుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పెరుగుతున్న దిగుబడులకు అనుగుణంగా అశ్వారావుపేటలో 60 టి పి హెచ్ నూతన ఫ్యాక్టరీ నిర్మాణం, కల్లూరుగూడెంలో ఫ్యాక్టరీ పనుల వేగవంతం, ములకలపల్లి లేదా పాల్వంచలో మరొక కొత్త ఫ్యాక్టరీ నిర్మాణంతో పాటు అప్పారావుపేట సామర్థ్యాన్ని 90 టి పి హెచ్ కు పెంచేలా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురానున్నారు. ఇతర జిల్లాల్లో ఒప్పందాల ప్రకారం ప్రైవేటు పరిశ్రమలు వెంటనే స్థాపించేలా ప్రభుత్వంపై పోరాడనున్నారు.

**పారదర్శకత అనేది రైతు ప్రాథమిక హక్కు.**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉత్పత్తవుతున్న 70,000 టన్నుల క్రూడ్ ఆయిల్ ప్రాసెసింగ్ కోసం ఖమ్మంలో మొదటి రిఫైనరీ, ఆ తర్వాత సిద్దిపేటలో మరొకటి నిర్మించేలా కృషి జరుగుతోంది. ప్రతి రైతుకు సంబంధించిన సర్వే నంబర్, మొక్కల రకం, బ్యాచ్ నెంబర్, సరఫరా వివరాలు, చెల్లింపులు అన్నీ పారదర్శకంగా మొబైల్ యాప్ ద్వారా అందుబాటులోకి తేవాలి. ప్రతి నెలా రేట్ ఫిక్సేషన్ వివరాలను (శాతం, క్రూడ్ సేల్స్, కెర్నల్ నట్ సేల్స్) రైతు సంఘాలతో పంచుకోవడంతో పాటు, కెర్నల్ ఆయిల్ ప్రాసెస్ చేసి ఆయిల్ సేల్ మీద కాకుండా నట్ సేల్ మీదే ధరను నిర్ణయించే విధానాన్ని తీసుకురావాలి.

పర్యావరణ హిత వ్యవసాయం, రైతుల సాధికారతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫ్యాక్టరీల్లో బయోమాస్ పవర్ ప్లాంట్లకు బదులు సోలార్ వాడాలని, తద్వారా మిగిలే బంచ్ ఫైబర్, పామ్ ఫైబర్ వంటి వాటిని సేంద్రీయ ఎరువులుగా రైతులకు తక్కువ ధరకు అందించాలి. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కంపెనీలు రైతులను బానిసల్లా చూడటం మాని, భాగస్వాములుగా గౌరవించే సంస్కృతిని తీసుకురావాలి. సబ్సిడీలు నేరుగా రైతులకు అందేలా చూడటం, ఎన్ఎంఈఓ ఓ పి స్కీమ్ కింద ఫార్మ్ మెకనైజేషన్ వసతులు కల్పించడం సంఘం ముందున్న కర్తవ్యాలు. ఫ్రూట్ కలెక్షన్ సెంటర్లను రైతుల దరిదాపుల్లోనే ఏర్పాటు చేయాలి, వీటి కేటాయింపుల్లో ఎఫ్‌పీఓలకు , కోఆపరేటివ్ సొసైటీలకు, డ్వాక్రా సంఘాలకు పెద్ద పీట వేయాలి. ఫ్యాక్టరీల సీఎస్సార్ ఫండ్స్‌ను కేవలం రైతుల తోటల రహదారుల అభివృద్ధికి, స్థానిక మౌలిక సదుపాయాలకే వాడాలి. గత ఐదేళ్లుగా పెంచని రవాణా ఛార్జీలను ప్రస్తుత ట్రాక్టర్ కిరాయిలకు అనుగుణంగా 50 శాతం పెంచాలి.

రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించడంలో సంఘం ముందుంటుంది. తెలంగాణలో ఐఐఓపీఆర్ ప్రాంతీయ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతి జిల్లాలో మోడల్ గార్డెన్స్ ఏర్పాటు చేసి అదనపు సబ్సిడీలు ఇప్పించాలి. సేంద్రీయ వ్యవసాయం, బయో ఫెర్టిలైజర్స్ వాడకం, గానోడర్మ, స్టెమ్ వెట్‌రాట్, తెల్లదోమ వంటి తెగుళ్ల నివారణ, నీటి యాజమాన్యం, అంతర పంటలపై రైతులకు నిరంతర శిక్షణ అందించాలి. కంపెనీ ఫీల్డ్ స్టాఫ్, హార్టికల్చర్ అధికారులు నిరంతరం తోటలను పర్యవేక్షిస్తూ సరైన సూచనలు ఇవ్వాలి.

ఇలా అశ్వారావుపేట కేంద్రంగా ఉద్భవించిన ఆయిల్ పామ్ రైతు సంఘం, నేడు రాష్ట్ర స్థాయికి ఎదిగి ప్రతి రైతు కంటతడి తుడవడానికి, కార్పొరేట్ సంస్థల దోపిడీని అడ్డుకోవడానికి ఒక కవచంలా నిలబడింది. రైతుల చెమట చుక్కలు లాభాలుగా మారుతున్న పరిశ్రమల్లో, అదే రైతును చక్రవర్తిగా నిలబెట్టే వరకు ఈ సంఘం పోరాటం అనవరతం కొనసాగుతూనే ఉంటుంది.

**(గడల నరసింహారావు**
**సీనియర్ జర్నలిస్ట్)**



# చేనేత రంగం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తా

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి జూలై 13 మహా** చేనేత రంగం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘం సభ్యులకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన భువనగిరి చేనేత సహకార సంఘం పాలకవర్గ సభ్యులు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఆ సంఘం నూతన అధ్యక్షుడు ఏలే సుధాకర్ , కార్యదర్శి గర్దాసు చంద్రమౌళి, , ఉపాధ్యక్షుడు తిరందాసు దానయ్య , డైరెక్టర్లు గర్గాసు వెంకటేశం , అందె రాములు , మెలగందుల హరినాథ్ , బడుగు శ్రీనివాస్, గర్దాసు లలితలు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.అనంతరం సంఘం అభివృద్ధి, చేనేత కార్మికుల సంక్షేమం, సహకార సంఘం బలోపేతం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఎమ్మెల్యేతో పాలకవర్గ సభ్యులు చర్చించారు. చేనేత రంగ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, కార్యదర్శి, పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేస్తూ, వారి పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు చిలుక నాగరాజు , సంజీవరెడ్డి , వేముల ధనుంజయ్ ,ఏలే మధుసూదన్ , గర్దాసు మధు , గర్గాసు బాల నరసింహ , గంగాపురం రమేష్ తదితరులు పాల్గొన్నారు..

# సింగరేణి అధికారుల సమస్యలపై సత్వరమే సానుకూల నిర్ణయం తీసుకోండి

- సింగరేణి యాజమాన్యానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సుమారు 2,200 మంది అధికారులకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై వీలైనంత త్వరగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. కోల్ ఇండియా సంస్థల మాదిరిగా సింగరేణి అధికారుల వేతన సవరణ, పర్‌ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్ (పిఆర్పి) అమలుకు సంబంధించి అధికార సంఘం నాయకులు చేసిన విజ్ఞప్తులను ప్రాధాన్యంగా పరిగణించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇటీవల ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చొరవతో తాడిచర్ల2 బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరు కావడంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పోషించిన కీలక పాత్రకు కృతజ్ఞతలు తెలుపుతూ సింగరేణి అధికార సంఘం నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా అధికారులకు సంబంధించిన వివిధ సమస్యలను త్వరగా పరిష్కరించేలా సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయాలని ఆయనను కోరారు.

ఈ విజ్ఞప్తులపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పోట్రుతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ప్రజా ప్రభుత్వం సింగరేణి అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఇంధన భద్రతను అందించడంలో సింగరేణి కార్మికులు అధికారులు విశేష కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారుల్లో ఎలాంటి అసంతృప్తి నెలకొనకుండా వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికార సంఘం నాయకులతో చర్చించి వారికి భరోసా కల్పించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా రానున్న రెండు నుంచి మూడు నెలల్లో అధికారుల విజ్ఞప్తులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా మారుతున్న ప్రపంచీకరణ పరిస్థితులు పెరుగుతున్న పోటీని దృష్టిలో ఉంచుకొని బొగ్గు ఉత్పత్తి విక్రయాల్లో సింగరేణి పోటీతత్వాన్ని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిని బహుముఖ రంగాల్లో విస్తరించి అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు అధికారులు కీలక పాత్ర పోషించాలని ఈ దిశగా అధికార సంఘం నాయకులు కూడా అధికారుల్లో సానుకూల దృక్పథం కపెంపొందించేలా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు.

**ఉప ముఖ్యమంత్రికి సింగరేణి అధికార సంఘం నాయకుల కృతజ్ఞతలు**

సింగరేణి సుస్థిర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనకు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సింగరేణి అధికార సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇటీవలే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి తమ సమస్యలను వివరించామని దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సత్వరమే పరిష్కరించాలని యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయడంపై వారు ఉప ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి అభివృద్ధి విస్తరణ సుస్థిర భవిష్యత్ కోసం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి అధికారుల తరపున సంపూర్ణ మద్దతు అందిస్తూ సంస్థ పురోగతి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు.



# బల్దియాకు వినతుల వెల్లువ

**మహా వరంగల్:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమంలో నగర ప్రజల నుంచి భారీ సంఖ్యలో వినతులు అందాయి. అదనపు కమిషనర్ జోనా, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కలిసి ప్రజలు సమర్పించిన దరఖాస్తులను స్వీకరించి, పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు పంపించారు.అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం మొత్తం 111 ఫిర్యాదులు అందాయి. వాటిలో టౌన్ ప్లానింగ్ - 58, ఇంజనీరింగ్ - 36, రెవెన్యూ - 6, హెల్త్ అండ్ శానిటేషన్ - 7, నీటి సరఫరా - 2, హార్టికల్చర్ - 2 దరఖాస్తులు ఉన్నాయి.ఈ కార్యక్రమంలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి సీపీ రవీందర్ రాడేకర్, అకౌంట్స్ అధికారి శివలింగం, పన్నుల అధికారి రామకృష్ణ, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, సెక్రటరీ అనిల్‌బాబు తదితర అధికారులు పాల్గొన్నారు.



# సిద్ధేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

**ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



**యాదాద్రి భువనగిరి / జనగామ జూలై 13 మహా** బచ్చన్నపేట మండలంలోని కొడవటూర్ శ్రీ సిద్ధేశ్వర స్వామి దేవాలయంలో గుట్ట చుట్టూ సోమవారం గిరి ప్రదక్షిణ చేశారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బీర్ల ఐలయ్య భక్తుల కోలాహలం మధ్య అత్యంత వైభవంగా గిరి ప్రదర్శన కొనసాగింది బీర్ల అయిలయ్య ఆలయానికి కుటుంబ సమేతంగా చేరుకుని శ్రీ సిద్ధేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆశీర్వాదాలు స్వీకరించి, భక్తులతో కలిసి గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో "హర హర మహాదేవ" నినాదాలు చేస్తూ గిరి ప్రదక్షిణను నిర్వహించగా ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మార్మోగాయి. అనంతరం ఏర్పాటు చేసిన సభలో బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, కొడవటూర్ శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రాచీనమైనదని, ఈ ఆలయానికి విశేష ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాధాన్యం ఉందని అన్నారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఈ దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన అభివృద్ధి పనులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వ పరంగా చేయూత అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఆలయాల అభివృద్ధితో పాటు భక్తులకు సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అర్చకులు, వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన శివభక్తులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం ఫీజు రాయితీ అమలు చేయాలి

**జిల్లా కలెక్టర్‌కు సామాజిక సేవకుడు కర్నే బాబురావు వినతి**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కరీంనగర్, మహబూబాబాద్ జిల్లాల మాదిరిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 2026-27 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలలలో వంద శాతం ఫీజు రాయితీ అమలు చేయాలని కోరుతూ సామాజిక సేవకుడు, జర్నలిస్టుల హక్కుల పరిరక్షకుడు కర్నే బాబురావు సోమవారం జిల్లా కలెక్టర్ అంకిత్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో జిల్లా విద్యాశాఖ అధికారులు అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 100 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసి అమలు చేస్తున్నప్పటికీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇప్పటికీ ఆసౌకర్యం అందుబాటులోకి రాకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. పెరుగుతున్న విద్యా ఖర్చుల నేపథ్యంలో జర్నలిస్టుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని వారి పిల్లలకు విద్యలో సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి (డీఈఓ)ద్వారా జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలకు వెంటనే ఉత్తర్వులు జారీ చేసి అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 2026-27 విద్యా సంవత్సరానికి 100 శాతం ఫీజు రాయితీ అమలు చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య బీమా, టీఎస్ఆర్టీసీ ఉచిత లేదా రాయితీ బస్సు ప్రయాణం, రైల్వే ప్రయాణ రాయితీలు, ఇందిరమ్మ ఇల్లు తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలోని ఇతర జిల్లాలలో అమల వుతున్న జర్నలిస్టుల సంక్షేమ చర్యలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా అమలు చేయాలని ఈ విషయంపై జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని బాబురావు కోరారు.



# శ్రీ శివ శంకరి గోశాల ప్రారంభం

**గో సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత ఏనుగు సుదర్శన్ రెడ్డి**



**కుషాయిగూడ, మహా :** ఘట్కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీ నగర్‌లోని శ్రీ శివ శంకరి వేదపీఠం ఆధ్వర్యంలో శ్రీ శివ శంకరి గోశాల ప్రారంభోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వేదపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ గబ్బిట కాశి కోటేశ్వర శర్మ సారథ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గోశాలను ప్రారంభించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని గోమాతకు పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ గోమాత భారతీయ సంస్కృతి, సనాతన ధర్మానికి ప్రతీక అని అన్నారు. గో సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, గోశాలలు కేవలం పశువుల సంరక్షణ కేంద్రాలు మాత్రమే కాకుండా భారతీయ ఆధ్యాత్మిక విలువలకు నిలయాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. గోశాల అభివృద్ధికి దాతలు, భక్తులు ముందుకు వచ్చి సహకరించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ప్రసాద్, సోను సింగ్, వేదపండితులు, భక్తులు, దాతలు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించకుంటే సమరమే

- అంగన్వాడీలు కట్టు బానిసలు కాదు
- రూ.18 వేల గౌరవ వేతన హామీని ముఖ్యమంత్రి నిలుపుకోవాలి
- అంగన్వాడీలతో పెట్టుకుంటే ప్రభుత్వానికి పతనం తప్పదు
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసఫ్



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** అంగన్వాడీల సహనాన్ని చేతగానితనంగా భావించొద్దని వారి సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తే సమరం తప్పదని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఏఐటీయూసీ అనుబంధ అంగన్వాడీ టీచర్లు హెల్పర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర రెండవ రోజు సోమవారం పాల్వంచ పరిధిలోని పెద్దమ్మతల్లి దేవాలయం ఆవరణ నుండి ప్రారంభమైంది. ఈ పాదయాత్రను ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీగా పాల్వంచలోని అంబేద్కర్ సెంటర్ వరకు చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్కు చేరుకుని వందలాది మందితో ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిడబ్ల్యుఓ స్వర్ణలత లేనినకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూసఫ్ మాట్లాడుతూఅంగన్వాడీలు కట్టు బానిసలు కాదని చాలీచాలని వేతనాలు ఇస్తూ అధిక పని భారంతో వెట్టి చాకిరీ చేయించుకోవాలనే ప్రభుత్వ వైఖరిని ఇకపై సహించేది లేదని స్పష్టం చేశారు. అంగన్వాడీలతో పెట్టుకున్న ప్రభుత్వాలకు పతనం తప్పదని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో అంగన్వాడీలకు రూ.18 వేల గౌరవ వేతనం చెల్లిస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం పాలకులకు తగదని మండిపడ్డారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మాతా శిశు సంరక్షణ పౌష్టికాహార పంపిణీ చిన్నారుల సంక్షేమంలో అంగన్వాడీలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేస్తున్న అంగన్వాడీల శ్రమను గుర్తించకుండా వారిపై సంబంధం లేని అదనపు విధులను మోపడం దారుణమన్నారు. కనీస వేతనాలు ఉద్యోగ భద్రత కల్పించకుండా పనిభారం పెంచడం శ్రమదోపిడీయేనని ధ్వజమెత్తారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని యూసఫ్ డిమాండ్ చేశారు. రూ.18 వేల గౌరవ వేతన హామీని అమలు చేయడంతో పాటు పని భారాన్ని తగ్గించి ఉద్యోగ భద్రత కల్పించి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపకుండా ఉద్యమాలను అణచివేయాలని చూస్తే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అంగన్వాడీల ఆగ్రహాన్ని ప్రభుత్వం తక్కువగా అంచనా వేయొద్దని వారి పోరాటానికి ఏఐటీయూసీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదని అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా సమరభేరి మోగిస్తామని యూసఫ్ హెచ్చరించారు.

**ముగిసిన పాదయాత్ర...**

ఏఐటీయూసీ అనుబంధ అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భద్రాచలంలో చేపట్టిన పాదయాత్ర సోమవారం కలెక్టరేట్ చేరుకోవడంతో ముగిసింది. దారి పొడవున ఏఐటియూసి ఎర్రజెండాలు హోరెత్తించాయి. సుమారు 40 కిలోమీటర్ల మేర నాయకులు అంగన్వాడీలు పాదయాత్ర నిర్వహించారు. రెండు రోజులు సాగిన ఈ పాదయాత్రకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. పాల్వంచలో సిపిఐ నాయకులు ఆడుసుమిల్లి సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, వీషంశెట్టి విశ్వేశ్వరరావు తో పాటు పలువురు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నరసింహారావు, నరాటి ప్రసాద్, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీతా మహాలక్ష్మి, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సాయి ఈశ్వరి కరుణకుమారి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి అరుణ గోనెమణితో పాటు మువ్వా లక్ష్మీ కుమారి కంచర్ల జమలయ్య వేల్పుల మల్లికార్జున్ రాజు షాహిన్ ధన లక్ష్మి కైసర్ పద్మ లక్ష్మి ప్రమీల రాణి సరోజ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కష్టాలకు బీఆర్ఎస్ కాంగ్రెస్సే కారణం

- తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ తో సింగరేణికి మనుగడ
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి



**భద్రాద్రి బ్యూరో, మహా:** సిరుల గని సింగరేణిని గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కష్టాలు పాలు చేసిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి భరోసా యాత్ర కార్యక్రమంలో భాగంగా బిజెపి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కొత్తగూడెం క్లబ్లో ఏర్పాటు చేసిన సభకి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఒకప్పుడు సింగరేణిలో ఎక్కువ సంఖ్యలో ఉన్న కార్మికులు క్రమక్రమంగా తగ్గిపోతున్నారని అంతేకాకుండా బొగ్గు ఉత్పత్తి సైతం క్రమంగా తగ్గుతుందని దీనికి కారణం రాష్ట్ర ప్రభుత్వాలేనని విమర్శించారు. ముఖ్యంగా గత కెసిఆర్ ప్రభుత్వం సింగరేణి సొమ్మును భారీగా దోచుకుందని మండిపడ్డారు. సింగరేణిని అభివృద్ధిలోకి నడిపించాల్సిన కేసీఆర్ బ్రష్టు పట్టించే విధంగా వ్యవహరించడం జరిగిందన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తుందని అసహనం వ్యక్తం చేశారు. గత కాంగ్రెస్ హయాంలోని ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ ఉన్న సమయంలో పెద్ద ఎత్తున బొగ్గు కుంభకోణం జరిగిందని ఆరోపించారు. కష్టాల్లో ఉన్న సింగరేణిని గట్టెక్కించేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం వేలం లేకుండా తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ ను సింగరేణికి కేటాయించడం జరిగిందన్నారు. ఈ బొగ్గు బ్లాక్ ద్వారా దాదాపు 50 ఏళ్ల పాటు నాణ్యమైన బొగ్గు దొరుకుతోందని తెలిపారు. దీంతో సింగరేణికి భారీ ఆదాయం సమకూరుతుందన్నారు.

**సింగరేణికి అండగా బిజెపి...**

ఎంతోమంది కార్మికులకు ఉద్యోగులకు ఉపాధి కల్పిస్తున్న సింగరేణి కాలరీస్ కంపెనీకి బిజెపి ప్రభుత్వం అండగా నిలుస్తుందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు అన్నారు. గత కెసిఆర్ ప్రభుత్వం సింగరేణిని ఏటీఎంగా వాడుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల కష్టంతో సింగరేణికి వచ్చిన సొమ్మును ఇతర పనులకు వినియోగించడం జరిగిందన్నారు. కార్మికుల సొమ్మును వారి సంక్షేమ కోసమే ఖర్చు చేయాల్సింది పోయి దుర్వినియోగం చేయడం అత్యంత బాధాకరమన్నారు. సింగరేణిలో 49 శాతం వాటా కేంద్ర ప్రభుత్వానిది ఉంటుందని 51 శాతం రాష్ట్ర ప్రభుత్వానిది ఉంటుందన్నారు. కంపెనీలో కేంద్రం వాటా ఉన్న కూడా కేంద్రం పెత్తనం ఉండదన్నారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వానిదే ఉంటుందని స్పష్టం చేశారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణిని అభివృద్ధిలో నడిపించడంలో విఫలం కావడం విచారకరమన్నారు. కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి కిషన్ రెడ్డి కృషి మేరకు నరేంద్ర మోడీ ప్రభుత్వం సింగరేణికి తాడిచర్ల2 బొగ్గు బ్లాకును కేటాయించడం జరిగిందన్నారు. ఈ బొగ్గు బ్లాకు కేటాయింపు ద్వారా నిరుద్యోగులకు ఉపాధి దొరకడమే కాకుండా నాణ్యమైన బొగ్గు లభిస్తుందని తద్వారా కంపెనీకి మంచి ఆదాయం వస్తుందన్నారు.

**సింగరేణి నిధులను రెండు ప్రభుత్వాలు వాడుకున్నాయి...**

సింగరేణి కార్మికులు కష్టపడి కంపెనీకి ఆదాయం చేకూరుస్తుంటే అట్టి ఆదాయాన్ని గత కెసిఆర్ ప్రభుత్వం ఇప్పుడు ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాడుకుంటుందని బిజెపి జాతీయ నాయకురాలు పార్లమెంటు సభ్యులు డీకే అరుణ అన్నారు. ఎంతో చరిత్ర ఉన్న సింగరేణిని నష్టాల్లోకి నెట్టే విధంగా ప్రభుత్వాలు ముందుకు పోవడం బాధాకరమన్నారు. సింగరేణి కష్టాలను గమనించిన బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి కృషితో నరేంద్ర మోడీ ప్రభుత్వం తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ ను సింగరేణికి కేటాయించడం జరిగిందన్నారు. ఫలితంగా సింగరేణి మళ్లీ అభివృద్ధిలోకి వస్తుందని పేర్కొన్నారు. సింగరేణి సొమ్ముతో సోకులు చేసిన బీఆర్ఎస్ కాంగ్రెస్ కు రానున్న ఎన్నికల్లో ప్రజలు కార్మికులు గట్టిగా బుద్ధి చెప్పాలని డీకే అరుణ పిలుపునిచ్చారు. ఈ సభ కార్యక్రమం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిజెపి అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న

**మహా వరంగల్ కార్పొరేషన్ ;** రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ను సోమవారం హనుమకొండలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ కమిషనర్ వెంకన్న కు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం గ్రేటర్ వరంగల్ నగర అభివృద్ధి, పారిశుద్ధ్యం, హరితహారం, పర్యావరణ పరిరక్షణ, మున్సిపల్ సేవల మెరుగుదలతో పాటు నగరంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పై చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ నగర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు నాణ్యమైన మున్సిపల్ సేవలు అందేలా కృషి చేయాలని కమిషనర్ కు సూచించారు.

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి

- **మంత్రి కిషన్ రెడ్డికి ఇనపనూరి నాగేశ్వరరావు విజ్ఞప్తి**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఇనపనూరి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం కొత్తగూడెంకు వచ్చిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఇనపనూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పని చేస్తున్నటువంటి కాంట్రాక్టు కార్మికులు గత 25 సంవత్సరాల నుండి వివిధ డిపార్టుమెంటులలో పని చేస్తున్నారని వీరికి వేతనాలు చాలా తక్కువగా వస్తున్నాయని పేర్కొన్నారు. చాలీచాలని వేతనాలతో తల్లిదండ్రులను పిల్లలను చదివించుకోవాలన్న వైద్యం చేయించుకోవాలన్న వేతనం సరిపోవడం లేదని చెప్పారు. సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియాలో అమలు చేస్తున్న హై పవర్ కమిటీ వేతనాలను లేదా తెలంగాణ రాష్ట్ర జీవో నెంబర్22 ను గెజిట్ చేసి అమలు చేయాలని కోరారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు హాస్పిటల్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. వేతనంతో కూడిన సెలవులను ఇచ్చే విధంగా చూడాలన్నారు. ఈ విషయంపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లుగా చెప్పారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ దొడ్డి నిర్మల, కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎడ్ల రాకేష్, కార్పొరేట్ కార్యదర్శి గుర్రం, సృజన్, కోశాధికారి పిట్టల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# మెరుగైన సౌకర్యాలకు గుర్తింపు

**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రపంచంలోని కుటుంబాలకు అత్యంతW అనుకూలమైన విమానాశ్రయాల జాబితాలో నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ప్రముఖ ట్రావెల్ ఎక్స్‌పీరియన్స్ సంస్థ అట్రాక్షన్ టికెట్స్.కామ్ విడుదల చేసిన తాజా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఈ ఘనత సాధించినట్లు జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సోమవారం వెల్లడించింది.ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో స్థానం సంపాదించిన రెండో భారతీయ విమానాశ్రయంగా శంషాబాద్ నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా 140కుపైగా విమానాశ్రయాలను కుటుంబాలకు అనుకూలమైన తొమ్మిది ప్రమాణాల ఆధారంగా పరిశీలించి ర్యాంకులను ప్రకటించారు.పిల్లల ఆట స్థలాలు, కుటుంబాల కోసం ప్రత్యేక భద్రతా తనిఖీ మార్గాలు, శిశు సంరక్షణ సదుపాయాలు, బేబీ స్ట్రోలర్ సేవలు, విశ్రాంతి ప్రాంతాలు, వైఫై నాణ్యత, విమానాశ్రయ విస్తీర్ణం, న్యూరో డైవర్జెంట్ ప్రయాణికులకు అందించే సౌకర్యాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రతి విమానాశ్రయానికి 20 మార్కుల స్కోర్ కేటాయించారు.ఈ మూల్యాంకనంలో శంషాబాద్ విమానాశ్రయం 20 మార్కులకు గాను 18.5 మార్కులు సాధించి ప్రపంచంలో కుటుంబాలకు అత్యంత అనుకూలమైన విమానాశ్రయాల జాబితాలో నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుందని జీఎంఆర్ సంస్థ తెలిపింది.



# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా నిబంధనల మేరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించారు. కొత్తగూడెం పరిధిలోని 66 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహిస్తున్నారా..? ఓటర్లు నింపిన ఫారాలను తిరిగి స్వీకరిస్తున్నారా..? అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫారాల పంపిణీ స్వీకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. బీఎల్‌వోలు సేకరించిన ఫారాలను ఎప్పటికప్పుడు డిజిటలైజ్ చేయాలని డిజిటలైజేషన్ ప్రక్రియను ఆపరేటర్లు అత్యంత అప్రమత్తంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు. డిజిటలైజేషన్‌లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఓటర్లకు ఫారాలు పూరించే విధానంపై అవగాహన కల్పిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఇంటి వద్ద అందుబాటులో లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు సేకరించి వారికి ఫారాలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బీఎల్‌వోలు తమకు కేటాయించిన పరిధిలో అందుబాటులో లేని ఓటర్ల వివరాలను సంబంధిత బీఎల్‌వో సూపర్వైజర్లకు వెంటనే తెలియజేసి ఫారాల పంపిణీ ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ పుల్లయ్య మాట్లాడుతూ కొత్తగూడెం పరిధిలో 66 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటి పర్యవేక్షణకు ఏడుగురు బీఎల్‌వో సూపర్వైజర్లు విధులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్‌కు వివరించారు.



# ప్రవేట్ పాఠశాలల బస్సులు రోడ్లపై నిలుపరాదు

**ప్రైవేటు పాఠశాలలకు శంషాబాద్ ట్రాఫిక్ పోలీసుల హెచ్చరికలు...**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్పోలీసులు ప్రవేట్ పాఠశాలలకు పలు హెచ్చరికలను సోమవారం జారీ చేశారు. బస్సుల పార్కింగ్ స్థలం పాఠశాల ఆవరణలోనే ఉండాలి బస్సులోని విద్యార్థి విద్యార్థులను పాఠశాల ఆవరణలోనే దించాలి, బస్సులో తప్పనిసరిగా విద్యార్థుల పర్యవేక్షణకు వ్యక్తిలను ఏర్పాటు చేసుకోవాలి. పాఠశాలల బస్సులను రోడ్లపై నీలపరాదు. పాఠశాలలు రద్దీ ప్రాంతాల్లో ఉంటే ఉదయం, సాయంత్రం అందుకు అనుగుణంగా సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేసుకోవాలి. బస్సు నడిపే వ్యక్తి నియమ నిబంధనలు పాటించాలి. ప్రతిరోజు డ్రైవర్ కి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించుకోవాలి. ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించి ట్రాఫిక్ కి సహకరించాలన్నారు. బస్సుల వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత ఉన్నత అధికారులకు ఫిర్యాదులు చేసి చర్యలు చేపడతామని ట్రాఫిక్ సీఐ ప్రమోద్ కుమార్ తెలిపారు.



# వైభవంగా రామానుజాచార్యుల ఆరుద్ర నక్షత్ర తిరుమంజన సేవలు....

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం ముచ్చింతల్ శ్రీరామనగరంలో సమతామూర్తి కేంద్రంలోఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భగవద్రామానుజాచార్య జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని సోమవారం స్వామి వారికి విశేష తిరుమంజన సేవను శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి దివ్య పర్యవేక్షణలో ఈ వేడుకలు శాస్త్రోక్తంగాఅత్యంత వైభవంగా నిర్వహించారు .ఈ అభిషేక కార్యక్రమంలో అహోబిల జీయర్ స్వామిజీ, సమతామూర్తి ప్రధాన అర్చకులు శ్రీమాన్ రఘుదత్తచార్య, మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిపించారు.



# ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాలు కేటాయించాలి

- **కే కే కమిటీ సభ్యులు కోదండరాంకువినతి పత్రం అందజేత..**

**రాజేంద్రనగర్ మహా;** శంషాబాద్ కి చెందిన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని కోరుతూ ఉద్యమకారులు మంచర్ల శ్రీనివాస్ కే.కే. కమిటీ సభ్యులు కోదండ రాంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని అమరజ్యోతి కార్యాలయంలో కే కేశవరావు అధ్యక్షతన నిర్వహించిన రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో ఈ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో సంవత్సరాలు ఉద్యమకారులు తమ కుటుంబాన్ని వదిలి రాష్ట్రం కోసం అహర్నిశలు సమయం, శ్రమ, జీవితాన్ని అంకితం చేశారు. రాష్ట్రం ఏర్పడి సంవత్సరాలు గడిచినా, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అనేక మంది తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి వారికి 250 గజాల ఇంటి స్థలానికి కేటాయించాలి ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, ఉద్యమకారులకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోదండరాంకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, వెంకట్ రెడ్డి, హన్మంత్ ముదిరాజ్, ఆర్కె, పలువురు తెలంగాణ ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.




# అక్రమ ఇంటి నిర్మాణాన్ని ఆపాలి...

- **ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేసిన.**
- **మాజీ సర్పంచ్ అంజయ్య గౌడ్.**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ తొండుపల్లి రెవెన్యూ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో 163 సర్వే నెంబర్లో 2007. 2008 లో అప్పటి ప్రభుత్వము182, (60 గజాల ) పాట్లకు గాను158 పాట్లు అర్హులకు అందజేశారు. అర్హులైన వారికోసం 24 పాట్లను అలాగే ఉంచారు. 24 ప్లాట్లల్లో కొంతమంది అక్రమంగా ఇళ్ళను నిర్మిస్తున్నారని మాజీ గ్రామ సర్పంచ్ అంజయ్య గౌడ్, బత్కు శ్రీనివాస్, జయసింహ పలువురు నాయకులు సోమవారం ఎమ్మార్వో అమరలింగం గౌడ్ కు ఫిర్యాదు చేశారు. అప్పటి ప్రభుత్వం 24 ప్లాట్లను వదిలేశారు. అవి ఎవరికి కేటాయించలేదు.ఫిర్యాదు పై ఎమ్మార్వో స్పందిస్తూ విచారణ జరిపిన అనంతరం తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

# నులిపురుగుల నివారణతో మెరుగైన ఆరోగ్యం

**మండల వైద్యాధికారి డాక్టర్ బి వెంకటేశ్వర్లు**



జూలూరుపాడు, మహా: నులిపురుగుల నివారణ ద్వారా పిల్లలు మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చునని మండల వైద్యాధికారి డాక్టర్ బి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎన్ డి డి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నులిపురుగుల నివారణ ద్వారా పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలు తగ్గి, వారి ఆరోగ్యం, ఎదుగుదల, జ్ఞాపకశక్తి, చురుకుదనం మెరుగుపడతాయని అన్నారు. అర్హత కలిగిన బాల, బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు అందేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని కోరారు. మండల వ్యాప్తంగా సంవత్సరం వయస్సు నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలు 10,556 మంది ఉన్నట్లు తెలిపారు. వారిలో ఇప్పటివరకు 8,719 మందికి మాత్రలు అందించినట్లు తెలిపారు. మిగిలిన వారికి ఈనెల 20వ తారీకు లోపు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పద్మజ, పోరండ్ల శ్రీనివాస్, కె రాధిక, కె ప్రియదర్శిని, హెల్త్ సూపర్వైజర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బక్కి వెంకటయ్యకు సన్మానం

**మొయినాబాద్, మహా:** దళిత, గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టడం, వారి సమస్యలకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా 1995లో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమల్లోకి వచ్చిందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయంలో ఆయనను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ రంగారెడ్డి జిల్లా సభ్యుడు బేగరి రాజు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ పీఠికను కూడా అందజేశారు.

ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు, ఇతర ఘటనలను అరికట్టేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన బేగరి రాజును ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో దళిత సేన జాతీయ అధ్యక్షుడు జె.బి. రాజు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మయ్య, జిల్లా శంకర్, రాంబాబు నాయక్, అఖిల భారత అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాడారం వినయ్ కుమార్, అసైన్డ్ భూమి సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శ్రీనివాస్, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు యాదగిరి, రాజేష్, ఇమ్మల్ తదితరులు పాల్గొన్నారు.

# నులి పురుగుల నివారణకు ఆల్బెండాజోల్ మాత్రలు

- **ఒకటి నుంచి 19 సంవత్సరాల ఆడపిల్లలకు తప్పనిసరి వేయించాలి**
- **రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి**
- **టీఎస్ డబ్ల్యూఆర్ఎస్ నల్లకంచలో విద్యార్థినులకు మందుల పంపిణీ**




**ఇబ్రహీంపట్నం జూలై 13 మహా:**పిల్లల్లో నులి పురుగుల నివారణ ద్వారా రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను తగ్గించడంతో పాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని జిల్లా అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి తెలిపారు. సోమవారం రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నల్లకంచెలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల మరియు కళాశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం (నేషనల్ డెవర్మింగ్ డే) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణకుమారి, పాఠశాల ప్రిన్సిపాల్ లీలావతితో కలిసి విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... పిల్లల్లో నులి పురుగుల నివారణ ద్వారా రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను తగ్గించడంతో పాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. జిల్లాలోని అర్హులైన ప్రతి చిన్నారికి ఈ మాత్రలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆడపిల్లలో నులిపురుగుల నివారణకు ఆల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరి వేయించాలని పిల్లల తల్లిదండ్రులకు ఆమె సూచించారు.జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణకుమారి మాట్లాడుతూ... జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి విద్యాశాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలు అందజేస్తున్నామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి బాలబాలిక తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. షీబా, ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. సత్యరత్న, సిడిపిఓ వినీతాదేవి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ వై సుదర్శన్, వైద్య అధికారులు, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయురాలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థినులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు

# రైతులు వరి పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి..

**వ్యవసాయ అధికారి అనూరాధ రెడ్డి**



**మొయినాబాద్ మహా:** తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ప్రాధాన్యత వరి రకాలను సాగు చేసిన రైతులు క్వింటాలుకు రూ. 500 బోనస్ పొందేందుకు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మొయినాబాద్ మండల వ్యవసాయ అధికారి అనూరాధ రెడ్డి సూచించారు. ప్రభుత్వం సన్న వరి సాగును ప్రోత్సహించే లక్ష్యంతో ఆర్ఎన్ఆర్ 15048 తెలంగాణ సోనా, బీపీటీ 5204 సాంబా మసూరి, సోనా మసూరి అన్ని కూడా పిలుస్తారు. కేఎన్ఎం 1638, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, డబ్ల్యూజీఎల్ 44, కేఎన్ఎం 7715 వంటి ప్రాధాన్యత వరి రకాలను సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందజేస్తోందన్నారు. బోనస్ పొందాలంటే రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్లను సంప్రదించి. పంట వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. నమోదు చేసిన రైతుల వివరాలను ప్రభుత్వానికి పంపించి, ధాన్యం కొనుగోలు సమయంలో అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో బోనస్ నేరుగా జమ చేస్తారని చెప్పారు. నమోదు చేయించుకోని రైతులకు బోనస్ వర్తించదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి అనూరాధ రెడ్డి మండలంలోని విత్తన దుకాణాలను సందర్శించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. రైతుల వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని విత్తన డీలర్లకు సూచించారు. మండలంలోని అర్హులైన రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఆమె కోరారు.



# నిస్సార భూగర్భ జల వనరుల నిర్వహణ-2.0 పోస్టర్ ఆవిష్కరణ

**ప్రతిజ్ఞ కార్యక్రమం లో పాల్గొన్న అధికారులు**

**మహా వరంగల్ కార్పొరేషన్ :** భారత కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అటల్ మిషన్ ఫర్ రెజువినేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్ఫర్మేషన్ (అమృత్)నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ (ఎన్ ఐ యు ఏ) సంస్థలు జల సంరక్షణ లో భాగంగా రూపొందించిన నిస్సార భూగర్భ జల వనరుల నిర్వహణ 2.0 పోస్టర్ ను సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బల్దియా అదనపు కమిషనర్ జోనా ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు సంయుక్తం గా ఆవిష్కరించారు .ఈ సందర్భం గా వివిధ విభాగాల అధికారులతో నీటి సంరక్షణ కోసం ప్రతిజ్ఞ నిర్వహించడం జరిగింది. అనంతరం నిర్వహించిన సమావేశం లో అదనపు కమిషనర్ మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యం లో నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని ఇందుకోసం నగరం లో ఇంకుడు గుంతల ఏర్పాటు ను ప్రోత్సహించి భూగర్భ జలాల పెంపు కోసం కృషి చేయడం జరుగుతుందని, బల్దియా పరిధి లో ప్రతి ఇల్లు, సొసైటీలు కార్యాలయాల్లో వర్షపు నీటి సేకరణ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఈ రాజ్ కుమార్ ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ టి ఓ రామకృష్ణ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ఈ ఈ మహేందర్ రవి కుమార్ సంజయ్ కుమార్ సంతోష్ బాబు మాధవి లత డి ఈ లు తదితరులు పాల్గొన్నారు.



# సంపూర్ణ ఆరోగ్యానికి నులి పురుగు నివారణ మాత్రలు

- **ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో రాణించగలరు**
- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**

హనుమకొండ మహా; 1 నుంచి 19 సంవత్సరాల వయసున్న ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యానికి నులి పురుగు నివారణ మాత్రను వేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో ఉత్తమ ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. పరీక్షల్లో ఆశించిన మార్కులు రాకపోవడానికి ప్రధాన కారణాల్లో ఒకటి అనారోగ్యం వల్ల పాఠశాలకు సరిగా హాజరు కాకపోవడమేనన్నారు. నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవడం ద్వారా పిల్లల ఆరోగ్యం మెరుగుపడి, పోషకాహారం శరీరానికి సక్రమంగా అందడంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. నులిపురుగులు కడుపులో ఉన్నట్లయితే బరువు ఎత్తు పెరగకుండా ప్రభావం ఉంటుందన్నారు. కాబట్టి ఒకటి నుంచి 19 ఏళ్ల వయసున్న వారు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రను తీసుకోవాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, సమయానికి నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని సూచించారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం పురస్కరించుకొని దేశవ్యాప్తంగా నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్నట్లు పేర్కొన్నారు. నులి పురుగుల నివారణ మాత్ర వేసుకోవడం ద్వారా ఆరోగ్యానికి ఎలాంటి హానిచేయదని పేర్కొన్నారు. నులిపురుగుల నివారణ కోసం మాత్రను వేసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటుందన్నారు. పాఠశాల విద్యార్థులు తమ చుట్టుపక్కల ఉన్నవారికి నులిపురుగుల నివారణ కోసం వేస్తున్న మాత్రను గురించి తెలియ జేయాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్ర ఆల్బెండజోల్ ను పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ ప్రదీప్ రెడ్డి, కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ సుమా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు భారీ షాక్

- **100 మంది కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీలోకి**
- **పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే నన్నపునేని**

**మహా వరంగల్ బ్యూరో ;** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 32వ డివిజన్ పరిధి వినాయక కాలనీలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరారు.వినాయక కాలనీ మాజీ అధ్యక్షులు దేశబైనా రాజేశ్వర్, ఉపాధ్యక్షులు మేకల నర్సింగ్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది కాంగ్రెస్, బీజేపీ పార్టీల కార్యకర్తలు గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ వారికి పార్టీ కండువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతూ, తెలంగాణ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నందునే ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని ఆయన పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని హామీ ఇస్తూ, రానున్న రోజుల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని నరేందర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 32వ డివిజన్ మాజీ అధ్యక్షులు పొగాకు సందీప్, పరదేశి రాజేష్, ధోనికాల ప్రవీణ్, దస్తగిరి, మటెటి శ్యామ్, పసునూరి సువర్ణ, సీతారాయుడు, నూక రమేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో రూ. 25 లక్షలతో

# స్కిల్ ప్లస్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్

**ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్**




**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ నగరంలోని సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో దేశ్‌పాండే ఫౌండేషన్, దాతల సహకారంతో రూ. 25 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన స్కిల్ ప్లస్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ ను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, దాతలు ఎన్.సి. మూర్తి, జీవన్ మూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ జి. పోశయ్య, మాజీ ప్రిన్సిపాల్ ఎ. ధర్మారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు మంత్రి కొండా సురేఖకు కళాశాల యాజమాన్యం ఘన స్వాగతం పలికింది. అనంతరం చంద్రకాంతయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు గౌరవ వందనం సమర్పించగా, అతిథులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో కార్పొరేట్ స్థాయికి దీటుగా నాణ్యమైన విద్య, ఆధునిక సౌకర్యాలు, విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. యువత నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం దేశ్‌పాండే ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన స్కిల్ ప్లస్ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి పరిశీలించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నెహ్రూ మెమోరియల్ పాఠశాల విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు అందించారు. తదుపరి జరిగిన సభలో కళాశాల ప్రిన్సిపాల్ జి. పోశయ్య, మాజీ ప్రిన్సిపాల్ ఎ. ధర్మారెడ్డి, దాత ఎన్.సి. మూర్తి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మంత్రి కొండా సురేఖ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. *దాత ఎన్.సి. మూర్తి మాట్లాడుతూ....* ఈ కళాశాలలో చదివి విదేశాల్లో స్థిరపడిన తమలాంటి పూర్వ విద్యార్థులు తమ స్వస్థల అభివృద్ధికి చేయూతనివ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. దాత జీవన్ మూర్తి మాట్లాడుతూ, సమాజానికి తిరిగి సేవ చేయగలగడం గొప్ప అవకాశమన్నారు. యువత నిరుద్యోగంతో బాధపడకుండా, కంప్యూటర్ నైపుణ్యాలు సాధించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలనే ఉద్దేశంతో దేశ్‌పాండే ఫౌండేషన్ ద్వారా ఈ స్కిల్ ప్లస్ కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చివరగా అతిథులు, దాతలను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# బాధితులకు భరోసా కేంద్రంలో న్యాయం జరిగేలా చూడాలి

**భరోసా కేంద్రాన్ని సందర్శించిన వరంగల్ సీపీ ఎన్ శ్వేత ఐపీఎస్**

వరంగల్ క్రైమ్; వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్ సోమవారం రంగంపేటలోని వరంగల్ భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి కేంద్రంలో అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా భరోసా కేంద్రంలో బాధితులకు అందిస్తున్న కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, మానసిక పరామర్శ, పునరావాస చర్యలు తదితర అంశాల పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్రానికి వచ్చే ప్రతి బాధితులను సానుభూతితో, గౌరవప్రదంగా స్వాగతించి, వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, చిన్నారులు, ఇతర బాధితులకు ఒకే వేదిక పై అన్ని సేవలు అందించే భరోసా కేంద్రం ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రతి కేసును నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించేలా సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. బాధితుల గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూడాలని అధికారులకు తెలిపారు. ఈ సందర్భనలో క్రైమ్ అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీ సదయ్య, భరోసా కేంద్రం ఇన్స్ స్పెక్టర్ సువర్ణ, మహిళా పోలీస్ స్టేషన్ 1 ఇన్స్ స్పెక్టర్ సూర్య ప్రసాద్, భరోసా ఎస్.ఐ కిరణ్మయి తో పాటు కౌన్సెలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# మైనర్ బాలికను మోసం చేసిన నిందితుడు అరెస్ట్, రిమాండ్ కు తరలింపు

**వివరాలు వెల్లడించిన ఏసీపి వెంకటేష్**




**మహా వరంగల్ క్రైం;**వరంగల్ జిల్లా గీసుగొండ మండల పరిధిలో ప్రేమ పేరుతో మైనర్ బాలికను మోసం చేసి, పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడిని గీసుగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. మామునూరు ఏసీపీ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం,2023 సంవత్సరం లో పదో తరగతి చదువుతున్న బాధితురాలికి, హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌కు చెందిన బొడ్డు బన్నీ (21) తో స్నేహితురాలి ద్వారా పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని నమ్మించిన నిందితుడు, అదే ఏడాది మార్చిలో పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమె పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. 2024 వరకు పలుమార్లు అఘాయిత్యాన్ని కొనసాగించాడు. 2025 మార్చిలో బాధితురాలు గర్భం దాల్చగా, విషయం బయటకు రాకుండా జన్మదినం రోజు కేకులో గర్భస్రావం అయ్యే మాత్రలు కలిపి తినిపించడంతో ఆమెకు గర్భస్రావం జరిగింది. అనంతరం తన వద్దకు రావాలని వేధించడమే కాకుండా, రాకపోతే చంపేస్తానని బెదిరించాడు. అంతేకాకుండా ఇటీవల వరంగల్ లో బాధితురాలి పై దాడి చేసి మొబైల్ ఫోన్ ను కూడా ధ్వంసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, భారతీయ న్యాయ సంహిత, పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద బొడ్డు బన్నీని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏసీపి మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రౌడీషీట్లు తెరుస్తామని ఏసీపీ వెంకటేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ డి విశ్వేశ్వర్, ఎస్సై కుమార్ తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఆరోగ్య పరిరక్షణలో తోటి సిబ్బందికి స్ఫూర్తిగా నిలవాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత,ఐపిఎస్**

**మహా హన్మకొండ ;** ఆరోగ్య పరిరక్షణలో పోలీస్ క్రీడాకారులు తోటి సిబ్బందికి స్ఫూర్తిగా నిలవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపిఎస్ తెలిపారు. ఇటీవల మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ లో జరిగిన ఐదవ రాష్ట్ర స్థాయిలో పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ మొదటి క్లస్టర్‌లో మొత్తం 61 పతాకాలను సాధించిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రీడాకారులకు సోమవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయములో అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధిగా పాల్గొని పతాకాలను సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ తరుపున ప్రాతినిధ్యం వహించి రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో పతకాలను సాధించడం వరంగల్ కమిషనరేట్ గర్వించదగిన విషయమని ఇందుకు పతకాలను సాధించిన క్రీడాకారులకు అభినందనలు తెలుపుతూ, ఇదే స్ఫూర్తితో నిత్యం క్రీడల సాధనతో ఆరోగ్యంగా వుంటూ, మిమ్మల్ని అదర్శంగా తీసుకుని వారంలో మూడు నుండి నాలుగు రోజులు పాటు కొద్ది సమయాన్ని కేటాయించి క్రమశిక్షణతో తమ ఆరోగ్య పరిరక్షణకై కృషి చేసే విధంగా తోటి పోలీస్ సిబ్బందికి ప్రేరణ కలిగించాలని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపిలు సురేష్‌కుమార్, శ్రీనివాస్,బాలస్వామి, ప్రభాకర్ రావు, ఏసిపి నాగయ్య, ఆర్.ఐ స్పర్జన్ రాజ్‌తో ఇతర పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ జయంతి**

**యాదాద్రి భువనగిరి జూలై 13 మహా:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.
సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 113 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 56, హౌసింగ్ 10, మున్సిపాలిటీ 7, సర్వే ల్యాండ్ 5, జిల్లా గ్రామీణ అభివృద్ధి



శాఖ 4, సంక్షేమ శాఖ 4,జిల్లా పరిషత్ 4, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు 3, విద్యాశాఖ 3,వైద్య ఆరోగ్య శాఖ 3, వ్యవసాయ 2, ఉపాధి కల్పన 2, పంచాయతీ 2, సమాచార శాఖ, ఇరిగేషన్, ట్రాన్స్పోర్ట్, పశు సంవర్ధక శాఖ, ఫుడ్ సేఫ్టీ, ఫిషరీస్, కోపరేటివ్, అటవీ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కృతిక,జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి , జెడ్పీ సీఈఓ శోభా రాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దుప్పల్లి ప్రభుత్వ పాఠశాలలో

# నూలి పురుగుల నివారణ దినోత్సవం

**వలిగొండ జులై 13 మహా న్యూస్ :** వలిగొండ మండలంలోని సి ఆర్ బి అర్దుప్పల్లి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూలి పురుగుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు పి విజయమాట్లాడుతూ నూలి పురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత బలహీనత చదువుపై శ్రద్ధ తగ్గుతుందన్నారు కాబట్టి ప్రతి విద్యార్థి తప్పని సరిగా మాత్ర వేసుకోవాలని అన్నారు ఆరోగ్య మహాభాగ్యం పరిశుభ్రత పాటిస్తే నులిపురుగుల భారీ నుండి కాపాడుకోవచ్చని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాధా కిషన్ శ్రీనివాస్ మహేశ్వర్ అండాలు యాదయ్య ఆరోగ్య అధికారి సత్తయ్య గ్రామ ఆశా వర్కర్ మరియు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



# ప్రజావాణి దరఖాస్తులు త్వరిత గతిన పరిష్కరించాలి

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**మహా వరంగల్ బ్యూరో ;** వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజలనుండి వినతులు స్వీకరించారు. ఈ ప్రజావాణి కి మొత్తం 191 దరఖాస్తులు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకు 65, మున్సిపాలిటీకి 10, హౌసింగ్ శాఖకు 44, ఇతర శాఖలకు సంబంధించి 72 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు తక్షణమే ఎండార్స్ చేసి సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖలు అధికారులను ఆదేశించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణికి రెవెన్యూ హౌసింగ్ జిడబ్ల్యుఎంసీ సమస్యలపై ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయని అట్టి దరఖాస్తులను పరిశీలనార్థం సంబంధిత శాఖలకు ఎండాఫ్ చేస్తూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, మరియు సంబంధిత జిల్లా అధికారులు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- **40 వేల నగదు, ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం**

**వరంగల్ క్రైమ్ ;**హనుమకొండ జిల్లా మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో కొంతమంది పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ రాజబాబు తన సిబ్బందితో కలిసి మడికొండ గ్రామ శివారులో దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా దాడి లో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ. 40,000 నగదు తో పాటు 7 మొబైల్ ఫోన్ల ను స్వాధీనం చేసుకున్నాము. అనంతరం వీరిపై కేసు నమోదు చేయడం జరిగిందని మడికొండ ఎస్‌హెచ్ఓ పుల్యాల కిషన్ ఓ ప్రకటనలో తెలిపారు.

# నులిపురుగుల నిర్మూలనకు శ్రీకారం

**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. ఎం. మనోహర్ విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. జిల్లాలో 1,51,040 మంది అర్హులైన చిన్నారులకు మాత్రలు అందించాలనే లక్ష్యంతో కార్యక్రమం చేపట్టగా, తొలి రోజే 96 శాతం మందికి పంపిణీ పూర్తయిందని తెలిపారు. మిగిలిన వారికి జూలై 20న నిర్వహించే మాప్‌అప్ డేలో మాత్రలు అందజేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.



# మహా పత్రిక






## సాంప్రదాయ లుక్ లో చైత్ర జె. ఆచార్

కన్నడ నటి చైత్ర జె. ఆచార్ మరోసారి తన హుందాతనంతో అభిమానులను ఆకట్టుకుంది. నలుపు రంగు సంప్రదాయ దుస్తుల్లో దిగిన అందమైన చిత్రాన్ని ఆమె సామాజిక మాధ్యమంలో "మానదరసి" అనే శీర్షికతో పంచుకుంది. ఈ చిత్రంలో చైత్ర సంప్రదాయ సొగసును ప్రతిబింబిస్తూ ఎంతో ఆకర్షణీయంగా కనిపించింది.చైత్ర సినీ ప్రయాణం రెండు వేల పది సంవత్సరంలో విడుదలైన "నాను నన్న కనసు" చిత్రంతో ప్రారంభమైంది. అనంతరం పలు చిత్రాల్లో సహాయ పాత్రలు పోషించి నటిగా మంచి గుర్తింపు సంపాదించింది. ఆ తర్వాత వచ్చిన చిత్రాల్లో తన సహజ నటన, భావోద్వేగాలను ఆవిష్కరించే తీరు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.వాణిజ్య చిత్రాలతో పాటు కథా ప్రాధాన్యమున్న చిత్రాల్లోనూ సమానంగా రాణిస్తున్న చైత్ర, కన్నడ చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంది. బలమైన మహిళా పాత్రలను సహజంగా పోషించడంలో ఆమెకు మంచి పేరు ఉంది. ప్రస్తుతం పలు కొత్త చిత్రాల్లో నటిస్తూ బిజీగా కొనసాగుతున్న చైత్ర, తన అందం, అభినయం, అంకితభావంతో అభిమానుల మన్ననలు పొందుతోంది.



## బాలీవుడ్ విలన్లే బాలయ్యా బలం

ఒకప్పుడు తెలుగు స్టార్ హీరోల మార్కెట్ ప్రధానంగా తెలుగు రాష్ట్రాలకే పరిమితమై ఉండేది. అయితే పాన్ ఇండియా ధోరణి బలపడిన తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఈ మార్పును అందిపుచ్చుకుంటూ నందమూరి బాలకృష్ణ తన సినిమాల్లో కొత్త తరహా వ్యూహాన్ని అమలు చేస్తున్నారనే చర్చ సినీ వర్గాల్లో వినిపిస్తోంది. ముఖ్యంగా బాలీవుడ్‌కు చెందిన ప్రముఖ నటులను ప్రతినాయకులుగా ఎంపిక చేయడం ద్వారా ఉత్తరాది ప్రేక్షకులను కూడా ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నట్లు విశ్లేషణలు వెలువడుతున్నాయి.ఇటీవలి చిత్రాల్లో బాలీవుడ్ నటులు కీలక ప్రతినాయక పాత్రల్లో కనిపించడం ఈ వ్యూహానికి నిదర్శనంగా మారింది. ఉత్తరాది ప్రేక్షకులకు సుపరిచితమైన నటులు బాలకృష్ణతో తలపడే పాత్రల్లో కనిపించడం వల్ల హిందీ ప్రేక్షకుల్లోనూ సినిమాపై ఆసక్తి పెరుగుతోందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో థియేట్రికల్ బిజినెస్‌తో పాటు డిజిటల్ హక్కుల విలువ కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. మరోవైపు బాలకృష్ణ చిత్రాల్లో ప్రతినాయక పాత్రలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండటం కూడా బాలీవుడ్ నటులను ఆకర్షిస్తున్న అంశంగా చెప్పబడుతోంది. బలమైన పాత్రలు, భారీ స్థాయిలో రూపొందే యాక్షన్ ఘట్టాలు వారికి నటన పరంగా కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి. అదే సమయంలో బాలీవుడ్ నటులకు దక్షిణాదిలో మరింత గుర్తింపు లభిస్తుండగా, బాలకృష్ణ సినిమాలకు ఉత్తరాదిలో విస్తృతమైన ఆదరణ పెరుగుతోంది. వరుస విజయాలతో మంచి జోష్‌లో ఉన్న బాలకృష్ణ, కథల ఎంపికతో పాటు తారాగణం విషయంలోనూ కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం తెరకెక్కుతున్న కొత్త చిత్రంలో కూడా ప్రముఖ బాలీవుడ్ నటుడు ప్రతినాయక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే తెలుగు ప్రేక్షకులతో పాటు హిందీ ప్రేక్షకుల్లోనూ ఆసక్తి నెలకొంది. ఈ విధమైన ఎంపికలు భవిష్యత్తులో మరిన్ని పాన్ ఇండియా ప్రాజెక్టులకు దారితీసే అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



## సమంతపై పెరిగిన అంచనాలు

తెలుగు చిత్రసీమలో కథానాయికగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న సమంత ప్రస్తుతం కెరీర్‌లో కీలక దశలో ఉన్నారు. కథకు ప్రాధాన్యం ఉన్న చిత్రాలతో పాటు మహిళా ప్రధాన పాత్రల్లోనూ తన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటూ ముందుకు సాగుతున్నారు. దీంతో ఆమె తదుపరి చిత్రాలపై సహజంగానే అంచనాలు పెరుగుతున్నాయి. ప్రేక్షకుల అభిరుచులు మారుతున్న నేపథ్యంలో నటనకు అవకాశం ఉన్న కథలను ఎంచుకోవడమే కాకుండా, వాణిజ్యపరంగానూ విజయాన్ని అందించే చిత్రాలను ఎంపిక చేయడం సమంతకు కీలకంగా మారింది. ఒకవైపు భారీ నిర్మాణ విలువలతో కూడిన సినిమాలు, మరోవైపు బలమైన కథాంశాలు ఉన్న పాత్రల మధ్య సమతుల్యత పాటించడం ఆమెకు సవాల్‌గా మారనుంది. గతంలో విభిన్న కథలతో ప్రయోగాలు చేసిన సమంత, నటిగా తన ప్రతిభను ఇ ప్ప టికే నిరూపించుకున్నారు. ఇప్పుడు అదే స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునే కథలను ఎంచుకుంటూ తన మార్కెట్‌ను మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. నిర్మాతలు, అభిమానులు ఆమె నుంచి ప్రతి చిత్రంలోనూ కొత్తదనాన్ని ఆశిస్తున్నారు.ఫిట్‌నెస్, పాత్రల ఎంపిక, నటనలో నిరంతరం కొత్తదనం చూపిస్తూ ముందుకు సాగుతున్న సమంతకు రానున్న చిత్రాలు కీలకంగా మారనున్నాయి. ప్రతి సినిమా ఆమె కెరీర్‌లో మరో మెట్టు కావాలంటే కథల ఎంపికలో తీసుకునే నిర్ణయాలే ప్రధాన పాత్ర పోషిస్తాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



## కొరియా వరకు వరుణ్ జోష్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న 'కొరియన్ కనకరాజు' (కోకా) చిత్ర టీజర్‌ను పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ విడుదల చేశారు. విడుదలైన వెంటనే టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. పెనుకొండ నుంచి కొరియా వరకు సాగే ఆసక్తికర కథతో తెరకెక్కిన ఈ చిత్రంలో వరుణ్ తేజ్ పాత్రను దర్శకుడు మేర్లపాక గాంధీ వినూత్నంగా ఆవిష్కరించినట్లు టీజర్ సూచిస్తోంది. వినోదం, యాక్షన్, భావోద్వేగాల సమ్మేళనంగా రూపొందుతున్న ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఎస్. తమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజువల్స్, కొరియా నేపథ్యంలో తెరకెక్కించిన సన్నివేశాలు, వరుణ్ తేజ్ కొత్త లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, యూవీ క్రియేషన్స్, టీసిరీస్ సౌత్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే టీజర్‌కు లభిస్తున్న ఆదరణతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.






## 'లెనిన్'కు పైరసీ బ్రేక్?

తెలుగు చిత్ర పరిశ్రమను ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న ప్రధాన సమస్యల్లో సినిమా పైరసీ ఒకటి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రాలు విడుదలైన కొద్ది గంటల్లోనే పైరసీ వెబ్‌సైట్లు, టెలిగ్రామ్ ఛానళ్లలో ప్రత్యక్షమవుతూ నిర్మాతలకు భారీ నష్టాలు కలిగిస్తున్నాయి. అయితే తాజాగా విడుదలైన 'లెనిన్' సినిమా విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. సినిమా విడుదలై తొలి వీకెండ్ పూర్తయ్యే వరకు పెద్ద ఎత్తున పైరసీకి సంబంధించిన సమాచారం బయటకు రాకపోవడం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. దీనికి నిర్మాత నాగ వంశీ అనుసరించిన వ్యూహమే కారణమా అనే చర్చ సోషల్ మీడియాలో సాగుతోంది. గతంలో ఆయన విదేశీ సెన్సార్, ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు సినిమా కాపీలు పంపే దశలోనే పైరసీ లీకులు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 'లెనిన్' చిత్రాన్ని యూఏఈలో విడుదల చేయకపోవడంతో పాటు అక్కడి సెన్సార్‌కు కూడా పంపలేదనే ప్రచారం జరుగుతోంది. దీంతో సినిమా కాపీ బయటకు వెళ్లే అవకాశాలు తగ్గి ఉండొచ్చని విశ్లేషణలు వినిపిస్తున్నాయి.అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ ప్రచారంలో ఎంతవరకు వాస్తవం ఉందో స్పష్టత లేదు. అయినప్పటికీ ఈ విధానం నిజంగానే ఫలిస్తే, భవిష్యత్తులో విడుదలయ్యే భారీ తెలుగు చిత్రాలకు ఇది ఆదర్శంగా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పైరసీకి దారితీసే మార్గాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటే చిత్ర పరిశ్రమకు మరింత మేలు జరుగుతుందని సూచిస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com